www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 244 శుక్రవారం, మే 29, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# తెలుగు జాతి గర్వించదగ్గ మహానేత ఎన్టీఆర్

## - మహానేతను గౌరవించడం ఏ పార్టీకి పరిమితం కాదు

- తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ సమర్థవంతమైన నేత
- ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు రాష్ట్ర ఆత్మగౌరవ ప్రతీక
- కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆరే!
- విగ్రహం ఏర్పాటులో విమర్శలకు తావులేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ





**హైదరాబాద్,మే 28 :** హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రివనం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఘనంగా ఆవిష్కరించారు. కాంగ్రెస్ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఏమిటని చాలా మంది విమర్శిస్తున్నారని.. ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసినా నేను భయపడను, వెనక్కి తగ్గను అని స్పష్టం చేశారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహానేతను గౌరవించడం ఏ పార్టీకి పరిమితం కాదని, అది అందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. జాతీయ స్థాయిలో ఇందిరా గాంధీ పి.వి. నరసింహారావు వంటి నాయకులను అందిస్తే, తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ కూడా అదే స్థాయిలో సమర్థవంతమైన నాయకత్వాన్ని తయారు చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో మాజీ సీఎం కేసీఆర్‌పై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. నాడు ఎన్టీఆర్ లేకుంటే కేసీఆర్ గానీ, లేదా ఇతర నేతలు గానీ ఈ స్థాయికి వచ్చేవాళ్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీ రామారావు అని, ఆయన నీడన బతికి ఈరోజు ఆయన గురించే తక్కువ మిగతా2లో...

# పూర్తి కావచ్చిన కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్

## - ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ఇక్కడే: అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ,మే 28 :** కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని చెప్పారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై అశ్వినీ వైష్ణవ్ కీలక సమీక్ష నిర్వహించారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేస్తుందన్నారు. వీటిని దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు రైల్వే మంత్రి తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ మిగతా2లో...

# ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు..

- అన్ని శాఖల లబ్ధిదారుల డేటా సమీకరణ
- పారదర్శక సేవలకు ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ



**హైదరాబాద్,మే 28 :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్) రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

మిగతా2లో...

# ప్రజా పక్షం వహించిన గొప్ప నేత ఎన్టీఆర్


- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్లు
- ఎన్టీఆర్‌కు పవన్ కల్యాణ్ ఘన నివాళి



2లో

# పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

## - కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మోడీ సమీక్ష



**న్యూఢిల్లీ,మే 28 :** అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించు కోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్-బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష మిగతా2లో...

# ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా

గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత

అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన

జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి



2లో

# దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబుల వెల్లడి



**హైదరాబాద్,మే 28 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో

మిగతా2లో...



# ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

- డబ్బా ఇళ్లు కాదు..డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
- పొంగులేటి సవావల్‌పై కెటిఆర్ ప్రతిసవాల్

**హైదరాబాద్,మే 28 :** సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మిగతా2లో...

# తెలంగాణకు చల్లని కబురు

## - రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం



**హైదరాబాద్,మే 28 :** తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడా నికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల మిగతా2లో...

# ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం




కావాలనే యాగీచేస్తున్న పలువురు నేతలు

ధాన్యం కొరుగోళ్లు సజావుగా సాగుతున్నాయన్న ఉత్తమ్

**హైదరాబాద్,మే 28 :** తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 75 లక్షల టన్నుల ధాన్యం మిగతా2లో...

# హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తత!

## - ఇరాన్‌పై అమెరికా బాంబుల వర్షం!



**న్యూఢిల్లీ,మే 28 :** ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ వంటి హోర్ముజ్ జలసంధి మరోసారి రణక్షేత్రంగా మారింది. ఇరాన్ సైనిక చర్యలను అడ్డుకునేందుకు మెరుపు దాడులు నిర్వహించింది అమెరికా. బుధవారం అర్ధరాత్రి అత్యంత కీలకమైన స్థావరాలపై డ్రోన్లతో విరుచుకుపడింది.

మిగతా2లో...

## తెలుగు జాతి గర్వించదగ్గ మహానేత ఎన్టీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చేసి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఎన్టీఆర్ పేరు చెప్పుకుని రాజకీయం చేస్తూ, ఆయన విగ్రహాల ఏర్పాటును వ్యతిరేకించడం లేదా తక్కువ చేయడం వారి నకిలీ ఆలోచనలకు నిదర్శనమని రేవంత్ ఎద్దేవా చేశారు.సంక్షేమ పథకాల విషయంలో ఎన్టీఆర్ దార్శనికతను రేవంత్ రెడ్డి ఆకాశానికెత్తారు. ఆనాడు ఎన్టీఆర్ ప్రారంభించిన పక్కా ఇళ్ల పథకమే నేటి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పునాది అని ఆయన గర్వంగా ప్రకటించారు. పేదలకు గూడు కల్పించాలనే ఎన్టీఆర్ సంకల్పాన్ని తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటి నేతలను రాజకీయాలకు పరిచయం చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని, ఆ వారసత్వాన్ని తాము గౌరవిస్తామని తెలిపారు.కాంగ్రెస్ వేదికలపై ఎన్టీఆర్ నామాన్ని జపించడంపై వస్తున్న రాజకీయ విమర్శలను రేవంత్ రెడ్డి కొట్టిపారేశారు. రాజకీయాలకు అతీతంగా ఎన్టీఆర్ ఒక వ్యవస్థ అని, ఆయన విగ్రహం అమీర్‌పేట వంటి ప్రాంతంలో ఉండటం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎన్టీఆర్ వేసిన పునాదులను ఎవరూ విస్మరించలేరని, అలాంటి మహానుభావుడికి నివాళి అర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. మైత్రివనం వద్ద జరిగిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం కేవలం ఒక విగ్రహావిష్కరణలా కాకుండా, రేవంత్ రెడ్డి రాజకీయ చాణక్యానికి వేదికగా మారింది. ఒకవైపు ఎన్టీఆర్ అభిమానులను ఆకట్టుకుంటూనే, మరోవైపు కేసీఆర్ , బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టడంలో రేవంత్ సక్సెస్ అయ్యారు. ఈ పరిణామం తెలుగుదేశం సానుభూతి పరులను కూడా కాంగ్రెస్ వైపు ఆలోచింపజేసేలా ఉందని భావిస్తున్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయటమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే రాజీవ్‌గాంధీ నిర్ణయాన్ని ఎన్టీఆర్ అమలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. ఇందిరమ్మ ఇళ్లలో ఉన్న నిరుపేదలకు టికెట్లు ఇచ్చి ఎమ్మెల్యేలను చేశాం. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్? మాట్లాడుతూ, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, నిలబెట్టుకున్నామని తెలిపారు. మాట ఇస్తే కాంగ్రెస్ నిలబెట్టుకుందనడానికి ఇదే నిదర్శనని వెల్లడించారు. ఎన్టీఆర్‌ను ఒక ప్రాంతా నికో, వర్గానికో పరిమితం చేయడం సరికాదని సూచిం చారు. పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ పాలన మాదిరే రేవంత్‌రెడ్డి పరిపాలిస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని తెలిపారు.జాతి గర్వించదగిన వ్యక్తి ఎన్టీఆర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనియాడారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది జూబ్లీహిల్స్ ప్రజల కోరిక అని అన్నారు. తెలుగువాడి గుండెల్లో చిరస్థాయిగా నిలబడి న వ్యక్తి ఎన్టీఆర్ అని, రేవంత్ రెడ్డి ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. పలువురు ఎన్టీఆర్ కుటుంబసభ్యులు కూడా హాజరయ్యారు.

## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు.మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోంద న్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ అభివృ ద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై మార్గనిర్దేశర చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు.

## ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు రాజకీయ లబ్ది కోసం ధాన్యం కొనుగోళ్లపై రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇకపోతే అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కొని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడిన పరిస్థితులపై మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించామని అన్నారు. అకాల వర్షాలకు తడిసిన 9,214 టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నష్టం కలిగించే ఎటువంటి చర్యలనూ ప్రభుత్వం ఉపేక్షించబోదని అన్నారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల టన్నుల ధాన్యం చేరగా, అందులో 57 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులకు ఇప్పటివరకు రూ.10,097 కోట్ల చెల్లింపులు జరిగాయని, దీని ద్వారా 8.15 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. కొనుగోలు చేసిన 57 లక్షల టన్నుల ధాన్యంలో 44.67 లక్షల టన్నులు దొడ్డు రకాల ధాన్యం కాగా, 12.33 లక్షల టన్నులు సన్న రకాల ధాన్యం అని మంత్రి పేర్కొన్నారు.

## ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా


**బెంగళూరు,మే 28:**కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు. ఈ క్రమంలో అధిష్టానంతో భేటీకి సిద్ధరామయ్య ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

## ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు..

(మొదటి పేజీ తరువాయి)

ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డ్ ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం ఈ విషయాన్ని ప్రత్యేకంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డ్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకేచోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత ఖచ్చితంగా చేరుతాయన్నారు. అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ ప్రభుత్వ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు.ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, ఇన్సూరెన్స్ పథకాలు, ప్రభుత్వం తీసుకువస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానించాలన్నారు.లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు.

## నాలుగు రాష్ట్రాలకు బిజెపి అధ్యక్షుల నియామకం



**న్యూఢిల్లీ,మే 28** భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు గురువారం పంజాబ్, హరియాణా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ వివరాలు వెల్లడించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రాను నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కేవల్ సింగ్ ధిల్లాన్ పేరును ప్రకటించింది. హరియాణా అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేబ్‌రాయ్‌ను నియమించింది. తొలిసారి ఎంపీ అయిన హర్ష్ మల్హోత్రాకి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది. ప్రస్తుతం ఆయన కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్నారు. తూర్పు ఢిల్లీ నియోజకవర్గానికి హర్ష్ మల్హోత్రా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేశ రాజధానిలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేందుకు మల్హోత్రాను అధ్యక్షుడిగా ప్రకటించారు.

## ప్రజా పక్షం వహించిన గొప్ప నేత ఎన్టీఆర్

**అమరావతి,మే 28** దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా పక్షాన నిలిచిన గొప్ప నేత ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ఆయన ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం చారిత్రాత్మకమైనదని గుర్తుచేశారు. ఎన్టీఆర్ చూపిన అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'అన్న క్యాంటీన్ల'ను నిర్వహిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. పేదలకు అండగా నిలవాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నామని తన సందేశంలో స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

## పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్‌- అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

## హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తత!

(మొదటి పేజీ తరువాయి)

బందర్ అబ్బాస్ నౌకాశ్రయం సమీపంలో ని ఇరాన్ నియంత్రణ కేంద్రమే లక్ష్యంగా జరిగిన ఈ దాడులు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితిని మరింత పెంచుతూ అమెరికా సైన్యం ఇరాన్ భూభాగంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో అమెరికా దళాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ ప్రయోగించిన నాలుగు వన్‌వే అటాక్ డ్రోన్లను అమెరికా సెంట్రల్ కమాండ్ దళాలు గాలిలోనే అడ్డుకుని ధ్వంసం చేశాయి. దీనికి కొనసాగింపుగా, ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ నౌకాశ్రయ నగరం సమీపంలో ఉన్న ఒక గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌పై అమెరికా క్షిపణి దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఐదో డ్రోన్ ప్రయోగాన్ని అమెరికా అడ్డుకోగలిగింది. ఈ దాడులు కేవలం ఆత్మరక్షణ కోసం చేసినవని అమరికా స్పష్టం చేసింది. అమెరికా అధికారుల కథనం ప్రకారం బంద్ అబ్బాస్ సమీపంలోని ఆ కేంద్రం నుంచి అమెరికా నౌకలపై మరిన్ని డ్రోన్లను ప్రయోగించేందుకు ఇరాన్ సిద్ధమమవుతోంది. ఆ ప్రాంతంలో ప్రయాణించే వాణిజ్య నౌకలకు, అమెరికా సైనిక బలగాలకు ఈ కేంద్రం వల్ల తీవ్రమైన ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో ముందస్తు జాగ్రత్తగా ఈ డిఫెన్సివ్ స్ట్రైక్స్ నిర్వహించినట్టు వైట్ హౌస్ వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం గురువారం తెల్లవారు జామున 1.30 గంటల సమయంలో బందర్ అబ్బాస్ ప్రాంతంలో భారీ పేలుళ్లు జరిగాయి. అమెరికా క్షిపణులు ఇరాన్ సైనిక మౌలికసదుపాయాలను తాకగానే ప్రాంతంలోని ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. ఈ దాడులు జరుగుతున్న టైంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ ఫ్రీఫాల్లో ఉందని, అక్కడ ద్రవ్యోల్బణం 250 శాతానికి చేరుకుందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ ప్రస్తుతం అత్యంత బలహీన స్థితిలో ఉందని, వారు శాంతి చర్చల కోసం తహతహలాడుతున్నారని ట్రంప్ అభిప్రాయపడ్డారు. చర్చల పేరుతో ఇరాన్ చేస్తున్న ప్రచారాన్ని ట్రంప్ ఖండించారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను నియంత్రించేదుకు ఒమన్, ఇరాన్ మధ్య ఒప్పంద కుదిరిందన్న వార్తలను వైట్ హౌస్ తోసిపుచ్చింది. అటువంటి మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ ఏదీ లేదని, అది కేవలం కల్పితమని స్పష్టం చేసింది.

## తెలంగాణకు చల్లని కబురు

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది.రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ఎండతీవ్రత దృష్ట్యామధ్యాహ్నంవేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## పూర్తి కావచ్చిన కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్

(మొదటి పేజీ తరువాయి)

రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయి. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో సురక్షితమైన కోచ్ డిజైన్, ఆధునిక సౌకర్యాలు అమర్చుతాం. ఈ రైళ్లు గంటకు 130 కి.మీ వేగంతో ప్రయాణించేలా రూపొందిస్తాం.

వీటిలో రీజనరేటివ్ బ్రేకింగ్ కూడా ఉంటుంది. రైలు బ్రేకులు వేసినప్పుడు అది విద్యుత్ జనరేటర్‌గా మారి, పునరుత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే అధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నాం అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని?పడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం

- అర్హులైన లబ్దిదారులకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు
- వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి.
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క









**ములుగు జిల్లా ప్రతినిధి మే 28 (పీపుల్స్ న్యూస్)**
పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన లబ్ధిదారులకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై, మంగపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఆడబిడ్డల వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలని, చట్టబద్ధమైన వయస్సు వచ్చిన తర్వాత మాత్రమే వివాహాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలని, బాలికల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, మంగపేట తహసీల్దార్ తోట రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలకు నిరసన.

-- సీతక్క ప్రెస్‌మీట్ బహిష్కరించిన ఏటూరునాగారం జర్నలిస్టులు



**(ఏటూరునాగారం) ములుగు జిల్లా ప్రతినిధి మే 28(పీపుల్స్ న్యూస్)**
వార్తలు రాసిన జర్నలిస్టుల ఇళ్లను ముట్టడిస్తాం, వారిపై దాడులు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఏటూరు నాగారం జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నేడు జరగనున్న మంత్రి సీతక్క ప్రెస్‌మీట్‌ను బహిష్కరించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి రోడ్డుపై నిరసన కార్యక్రమం చేపట్టి, జర్నలిస్టుల స్వేచ్ఛను హరించే విధంగా బెదిరింపులు చేయడం తగదని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు గౌరవం ఇవ్వాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# పంట వ్యర్థాలను కాల్చితే చర్యలు తప్పవు

- ఎస్సై చల్లా రాజు



**(వెంకటాపూర్ )ములుగు జిల్లా ప్రతినిధి మే 28( పీపుల్స్ న్యూస్)**
వెంకటాపూర్ పంట పొలాల్లో వరి కొయ్యలు, వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల జరిగే ప్రమాదాలకు కారణమైన వారిపై సాంరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చల్లా రాజు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై మాట్లాడారు. పట వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం తగ్గడమే కాకుండా, విద్యుత్ మోటార్లు, గడ్డివాములు తగలబడి రైతులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని అన్నారు. పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల వేసవి వడగాల్పులతో మంటలు వేగంగా వ్యాపించి రోడ్ల వెంట వెళ్లే వాహనదారులకు పొగ వ్యాపించడం వల్ల ప్రమాదాలకు దారితీస్తున్నాయని అన్నారు. వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియదున్ని సేంద్రియ ఎరువుగా వాడుకోవాలని చెప్పారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.?

# మైనర్ బాలిక జీవితంతో చెలగాటమాడితే సహించేది లేదు..

- తప్పుడు వార్తలు రాసే మీడియా సంస్థలకు నోటీసులు: మంత్రి సీతక్క





**ములుగు జిల్లా ప్రతినిధి మే 28 (పీపుల్స్ న్యూస్)**
ఏటూరునాగారంలో ఒక మైనర్ బాలిక వ్యవహారానికి సంబంధించి కొందరు ప్రతిపక్ష నాయకులు, వ్యక్తులు కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్డబ్ల్యూఎస్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో అసలు ఏం జరిగిందనే వాస్తవాలను, పోలీసులు మహిళా–శిశు సంక్షేమ శాఖ అధికారుల దర్యాప్తులో తేలిన విషయాలను ప్రజల ముందు ఉంచేందుకు ఏటూరునాగారంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారుల విచారణ వివరాలు వెల్లడించేం దుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేస్తే, కొందరు మీడియా ప్రతినిధులు దానిని బహిష్కరించి నిరసన చేపట్టడం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. “ఒక కాంగ్రెస్ నాయకురాలి కుమారుడిపై ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేసినందుకు వాస్తవానికి రోడ్డెక్కి నిరసన చేయాల్సింది మీరు కాదు.. మేము” అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కొన్ని మీడియా సంస్థలు రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారి కాంగ్రెస్ పార్టీని బద్నాం చేస్తున్నాయని మంత్రి ధ్వజమెత్తారు. రేటింగ్స్, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు వార్తలు ప్రచురించి ఒక మైనర్ బాలిక జీవితంతో చెలగాటమాడుతున్నార ని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఈ దుష్ప్రచారం వల్ల ఆ మైనర్ బాలిక కుటుంబం తీవ్ర మానసిక క్షోభకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోపణలు చేస్తున్న వారి వద్ద నిజంగా సరైన ఆధారాలు ఉంటే, వాటిని పోలీసులకు సమర్పించి నిలదీయాలని మంత్రి సీతక్క సవాల్ విసిరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న, ప్రసారం చేస్తున్న మీడియా సంస్థలకు లీగల్ నోటీసులు పంపుతామని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# త్యాగానికి ప్రతీకగా బక్రీద్.. సోదరభావానికి నిదర్శనంగా ఓల్డ్ బోయిన్‌పల్లి ఈద్గా

-- ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక నమాజుల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

-- “మత సామరస్యమే సమాజ బలము” అంటూ బక్రీద్ శుభాకాంక్షలు



**బాలానగర్ మే 29 ( పీపుల్స్ న్యూస్)** పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని ఈద్గా జామియా మజీద్ హుసేని ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. త్యాగం, భక్తి, దానం, మానవత్వానికి ప్రతీకగా భావించే ఈద్–ఉల్–అధా (బక్రీద్) పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఈద్గా ప్రాంగణానికి చేరుకుని ప్రత్యేక నమాజులు అర్పించి అల్లాహ్ కృప కోరారు. ప్రార్థనలతో మార్మోగిన ఈద్గా పరిసరాలు సౌభ్రాతృత్వానికి చిరునామాగా మారాయి. నమాజు అనంతరం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ తన అనుచర బృందంతో కలిసి ఈద్గా ప్రాంగణానికి చేరుకుని ముస్లిం సోదరులకు హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం మత పెద్దలు, యువకులతో ఆత్మీయంగా అలై–బలై కలుస్తూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఆయన రాకతో అక్కడి వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. ఈ సందర్భంగా ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ “బక్రీద్ పండుగ త్యాగానికి, దానగుణానికి, ప్రేమకు, సోదరభావానికి ప్రతీక. ప్రతి మతం శాంతి, మానవత్వం, సేవా భావాన్ని బోధిస్తుంది. సమాజంలో మత సామరస్యాన్ని కాపాడుకుంటూ పరస్పర గౌరవంతో ముందుకు సాగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది” అని పేర్కొన్నారు. అలాగే పేదలకు సహాయం చేయడం, అవసరంలో ఉన్నవారికి తోడ్పాటు అందించడం బక్రీద్ పండుగ గొప్ప సందేశమని తెలిపారు. ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు, సామా జిక కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.

# బక్రీద్ పర్వది వేడుకల్లో భక్తిశ్రద్ధలు సోదరభావానికి ప్రతీక

-- ఈద్గాలో ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాజా

**బాలానగర్ మే 29 ( పీపుల్స్ న్యూస్)**
పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా బాలానగర్ డివిజన్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాజా బాలంరాయ్ ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ఈద్ నమాజ్‌లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించి, దేశం మరియు రాష్ట్రంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఖాజా మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, మానవత్వం, సహనానికి ప్రతీక అని పేర్కొన్నారు. మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి సోదరభావంతో జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో నెలకొంటున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ మంచి బుద్ధి, శాంతి, సహనం ప్రసాదించాలని అల్లాను ప్రార్థించినట్లు చెప్పారు. అలాగే సమాజంలో ప్రేమాభిమానాలు పెరిగి, యువత మంచి మార్గంలో నడవాలని కోరుకున్నారు. ప్రజలంతా పరస్పర గౌరవంతో, ఐక్యతతో ముందుకు సాగితేనే



సమాజం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ రహ్మత్, మొహమ్మద్ ఇస్రారార్, మొహమ్మద్ ఇర్షాన్, మొహమ్మద్ అద్నాన్, అబ్దుల్ నిసార్ తదితరులు పాల్గొని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పంట పొలాలను తగలబెడితే కేసులు నమోదు చేయబడతాయి

- ఎస్సై ములుగు యూ. ఉపేందర్ రావు




**ములుగు జిల్లా ప్రతినిధి మే 28( పీపుల్స్ న్యూస్)**
పంట పొలాల ఉన్న వ్యర్థాలను తొలగించడానికి రైతులు వాటిని తగలబెట్టడం మూలంగా భూమిలోని మేలుచేసే కీటకాలు చనిపోయి భూమి సారం కోల్పోవడం జరుగుతుంది, అదేవిదంగా ప్రక్కనే ఉన్న కోయని పంటపొలం ఉన్నట్లయితే అవి దగ్ధం అయ్యి విలువైన పంట నష్టం అవుతుంది, ఇంకా బోర్, పైప్లు వంటి, డ్రిప్ పైపులు వంటి ఇ తర వస్తువులు దగ్ధం అవుతాయి, రహదారుల ప్రక్కన ఉన్న పంట పొలాలను తగలబెడితే అట్టి పొగ మూలంగా ఆక్సిడెంట్ అయ్యే అవకాశాలు ఉన్నాయ్ కావున పంట పొలాలను తగలబెట్టినట్లు ఐతే వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుంది, ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో రెం డు కేసులు నమోదు చేయడం జరిగింది అని హెచ్చరించడం జరిగింది కావున రైతులు గమనించి పంట పొలాలను తగలబెట్టరాదు అని ములుగు ఎస్సై యు. ఉపేందర్ రావు తెలుపడం జరిగింది

# మానసిక వికలాంగురాలైన మహిళను రక్షించిన గోషామహల్ పోలీసులుద

■ సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగింత



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 28 (పీపుల్స్ న్యూస్) :** అత్యంత అప్రమత్తతతో వ్యవహరించి, సమాచారం అందిన కొద్ది గంటల్లోనే ఒక మానసిక వికలాంగురాలైన మహిళను రక్షించి, సురక్షితంగా ఆమె కుటుంబ సభ్యులకు గోషామహల్ పోలీసులు అప్పగించారు. వివరాల్లోకి వెళ్ళితే.. మే 27, 2026 రాత్రి సుమారు 21:30 గంటల సమయంలో గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కానిస్టేబుళ్లు జి. శంభు లింగం, పి.సి. ఠాకూర్ ఆశిష్ సింగ్ నిరంతర గస్తీ (పెట్రోలింగ్) విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో నగర్‌ఖానా ప్రాంతం నుండి 'డైల్-100' (ఢయల్-100) ద్వారా ఒక అత్యవసర పిలుపు వచ్చింది. ఒక గుర్తుతెలియని, మానసిక వికలాంగురాలైన మహిళ తమ నివాస ప్రాంతంలో దిక్కుతోచని స్థితిలో తిరుగుతోందని స్థానికులు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, ఆ మహిళను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అయితే ఆమె మానసిక స్థితి సరిగా లేకపోవడంతో తన పేరు, చిరునామాను స్పష్టంగా చెప్పలేకపోయింది. దీంతో ఆమె రక్షణ , సంరక్షణను దృష్టిలో ఉంచుకుని, పోలీసులు వెంటనే ఆమెను గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది ఆమెను ఆప్యాయంగా విచారించగా, తన పేరు పద్మ (45) అని, తనది నాగసానిపల్లి గ్రామం అని మాత్రమే చెప్పగలిగింది. ఆమె మాట్లాడే భాష యాసను బట్టి కానిస్టేబుల్ జి. శంభు లింగం తన అనుభవంతో ఆ గ్రామం వనపర్తి (ఉమ్మడి మహబూబ్‌నగర్) జిల్లా పరిధిలోకి రావచ్చని ఊహిం చారు.వెంటనే స్పందించిన కానిస్టేబుల్ లింగం వనపర్తి పోలీస్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించి వివరాలు సేకరించారు. వారి ద్వారా శ్రీరంగపురం పోలీస్ స్టేషన్‌కు చెందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ దాకూరి మరియపు రెడ్డి సంప్రదింపు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గోషామహల్ ఏఎస్ఐ శ్రీనివాస్ , కానిస్టేబుల్ లింగం కలిసి శ్రీరంగపురం ఏఎస్ఐతో మాట్లాడారు. ఆయన నాగసానిపల్లి గ్రామంలో స్థానికంగా విచారణ జరపగా, సదరు మహిళా ఆ గ్రామానికి చెందినదేనని , గత ఐదు రోజులుగా కనిపించకుండా పోయిందని నిర్ధారణ అయింది. విషయం తెలుసుకున్న మహిళ కుమారుడు బోరవెల్లి నరేందర్ వెంటనే గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా సంప్రదించారు. ఐదు రోజుల క్రితం ఎల్.బి. నగర్ ప్రాంతం నుండి తన తల్లి తప్పిపోయిందని, ఆమె కోసం తాము తీవ్రంగా గాలిస్తున్నామని తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఆయన పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు అన్ని ఆధారాలను, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం బోరవెల్లి పద్మను ఆమె కుమారుడు నరేందర్‌కు సురక్షితంగా అప్పగించారు.ఐదు రోజులుగా ఆవేదనతో ఉన్న తమకు, కొద్ది గంటల్లోనే తల్లిని క్షేమంగా అప్పగించినందుకు బాధితురాలి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ, గోషామహల్ పోలీసుల తక్షణ స్పందనకు, మానవీయ కోణంలో చేసిన సహాయానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.సమయస్ఫూర్తితో, పట్టుదలతో వ్యవహరించి ఈ కేసును వేగంగా ఛేదించిన పోలీస్ కానిస్టేబుళ్లు జి. శంభు లింగం, ఠాకూర్ ఆశిష్ సింగ్ , ఏఎస్ఐ శ్రీనివాస్‌లను గోషామహల్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రవణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి, వారి వృత్తిపరమైన నిబద్ధతను కొనియాడారు.

# బ్యూటిఫికేషన్ పేరుతో పచ్చని మొక్కలను తొలగించడం ఎంత వరకు సమజసం





**కుత్బుల్లాపూర్,మే 28 (పీపుల్స్ న్యూస్) :** బ్యూటిఫికేషన్ పేరుతో పచ్చని మొక్కలను తొలగించడం ఎంత వరకు సమంసజసమని ఆకుల సతీష్ అన్నారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ రోడ్డులో డివైడర్ల బ్యూటిఫికేషన్ పేరుతో పచ్చగా పెరిగిన మొక్కలను తొలగించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అని అన్నారు. ప్రజలకు ఆక్సిజన్ అందించే, పర్యావరణాన్ని కాపాడే పచ్చని మొక్కలను సంరక్షించాల్సిన అధికారులు వాటిని తొలగించి మళ్లీ కొత్త మొక్కలు నాటడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే పెరిగిన మొక్కలను చంపి, మళ్లీ అదే తరహా మొక్కల కోసం లక్షల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం సమంజసం కాదన్నారు.పార్కుల్లో ఉన్న మౌలిక వసతులను తొలగించి తిరిగి ఏర్పాటు చేయడం ప్రజల పన్నుల డబ్బును దుర్వినియోగం చేయడమేనని విమర్శించారు.ఈ వ్యవహారంపై సీఎంసీ కమిషనర్ వెంటనే విచారణ జరిపి, యుబీడి డిపార్ట్మెంట్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా నిధులను అవసరమైన అభివృద్ధి పనులకు వినియోగించాలని, పచ్చదనాన్ని కాపాడాలని ఆయన కోరారు.

# కరెంటు షాక్‌తో పడిపోయిన విద్యుత్ కార్మికుడి ప్రాణాలు కాపాడిన పోలీస్ కానిస్టేబుల్

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 28 (పీపుల్స్ న్యూస్) :** విధి నిర్వహణలో విద్యుత్ స్తంభంపై తీవ్రమైన కరెంటు షాక్‌కు గురై, స్పృహతప్పి పడిపోయిన ఒక విద్యుత్ కార్మికుడికి టప్పా చబుత్రా పోలీస్ కానిస్టేబుల్ చాకచక్యంగా ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో జరిగిన ఈ ఘటన పోలీసుల సత్వర స్పందనకు, అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్ళితే... గురువారం కార్వాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అసిస్టెంట్ లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు నాయక్ (44) అనే కాంట్రాక్ట్ కార్మికుడు, కార్వాన్ ప్రాంతంలోని కుమ్మరవాడి హనుమాన్ దేవాలయం సమీపంలో ఒక విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ప్రమాదవశాత్తు లైవ్ హై-టెన్షన్ వైర్‌ను తాకడంతో తీవ్రమైన విద్యుత్ ఘాతానికి (ఎలక్ట్రిక్ షాక్‌కు) గురై, స్తంభం పైనుండి కింద పడిపోయారు. దీనితో ఆయన శ్వాస ఆగిపోయి, గుండె కొట్టుకోవడం నెమ్మదించి అక్కడికక్కడే స్పృహ కోల్పోయారు. ఆ సమయంలో సమీపంలోనే 'బ్లూ కోల్ట్స్-×' (దీజ-×) గస్తీ విధుల్లో ఉన్న టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బి. సురేష్ అక్కడ జరుగుతున్న కలకలాన్ని గమనించి, క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను గమనించిన ఆయన, బాధితుడి ముక్కు వద్ద శ్వాస ఆడటం లేదని గ్రహించి, తక్షణమే కార్డియో-




పల్మనరీ రిససిటేషన్ ప్రక్రియను ప్రారంభించారు.సకాలంలో సీపీఆర్ ప్రాణం పునరుద్ధరణ: కానిస్టేబుల్ సురేష్ బాధితుడి ఛాతిపై క్రమబద్ధంగా ఒత్తిడి తీసుకురావడంతో, కొద్దిసేపటికే రాజు నాయక్ గుండె స్పందన పునరుద్ధరించబడి, ఊపిరి పీల్చుకోవడం ప్రారంభించారు. ఆ విధంగా ప్రాథమిక అత్యవసర చికిత్స విజయవంతం కావడంతో, కానిస్టేబుల్ సురేష్ స్థానికుల సహాయంతో బాధితుడిని తదుపరి మెరుగైన వైద్యం కొరకు అత్యవసర వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

**ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి:**

ప్రస్తుతం సదరు విద్యుత్ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు ధృవీకరించారు. ప్రమాదం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్' (ముఖ్యమైన సమయం) లో పోలీ స్ అధికారి సకాలంలో స్పందించి సీపీఆర్ అందించడం వల్లే ప్రా ణాపాయం తప్పిందని, లేనిచో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉండేదని వైద్య నిపుణులు కొనియాడారు. ఆపత్కా లంలో అసా ధారణ సమయస్ఫూర్తిని, ధైర్యసాహసాలను ప్రదర్శిం చి ఒక మా నవ ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ బి. సురేష్ ను టప్పా చబుత్రా పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి. బాలకృష్ణ ప్రత్యే కంగా అభినందించారు. సమాజ రక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ ముం దుంటారని ఈ ఘటన మరోసారి నిరూపించిందని ఆయన పేర్కొన్నారు.

# పోలీసుల కన్నుగప్పి తిరుగుతున్న మోస్ట్ వాంటెడ్ రౌడీ షీటర్ అరెస్టు









**హైదరాబాద్ కమిషనరేట్ , క్రైమ్ బ్యూరో, మే 28 (పీపుల్స్ న్యూస్) :** 14 సంవత్సరాలుగా పోలీసుల కన్నుగప్పి తిరుగుతున్న మోస్ట్ వాంటెడ్ రౌడీ షీటర్ ను సు ల్తాన్ బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రౌడీ షీటర్ విష్ణవ్ కిషన్ దాస్ ఏ వి. గణేష్ మహరాజ్ 1999 నుండి రౌడీ షీట్ కొనసాగుతోంది. ఇతనిపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతో పాటు ఇతర జిల్లాల్లో మొత్తం (21) కేసులు నమోదయ్యాయి. ఇందులో ఐపీసీ సెక్షన్లు 302 (హత్య), 307 (హత్యాయత్నం), 341, 380, 457 మరియు ఆర్మ్స్ యాక్ట్ (ఆయుధాల చట్టం) వంటి అనేక ఘోరమైన నేరాలు ఉన్నాయి. 2010 నవంబర్ 30న నాంపల్లిలోని ×× ఏసీఎంఎం కోర్టు ముందు లొంగిపోయి, 02.05.2012 న బెయిల్‌పై విడుదలయ్యాడు. ఆ తర్వాత నుండి గత 14 సంవత్సరాలుగా కోర్టు విచారణకు హాజరుకాకుండా పరారీలో ఉంటున్నాడు. అంతకుముందు 2003 నుండి కూడా ఇతను పోలీసులకు దొరకకుండా తిరుగుతూ మరిన్ని నేరాలకు పాల్పడ్డాడు. ఇతనిపై ఎల్‌పీసీ కూడా పెండింగ్‌లో ఉంది.పరారీలో ఉన్న ఈ రౌడీ షీటర్‌ను పట్టుకోవడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక ప్రత్యేక బృందం ఏర్పాటయింది. నిరంతర నిఘా , క్షేత్రస్థాయి విచారణలో పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. నిందితుడు తన క్రిమినల్ గుర్తింపును దాచిపెట్టడానికి, పోలీసుల నిఘా నుండి తప్పించుకోవడానికి తన ఆధార్ కార్డు , ఇతర పత్రాలలో తన చట్టపరమైన పేరును 'వైష్ణవ్ కిషన్ దాస్' నుండి 'వైష్ణవ్ గణేష్ మహరాజ్' గా ఉద్దేశపూర్వకంగా మార్చుకున్నాడని, ప్రస్తుతం హైదరాబాద్‌లోని మలక్‌పేటలో నివసిస్తున్నాడని తెలిసింది. ఈ ఖచ్చితమైన సమాచారంతో ఈ నెల 27న సుల్తాన్ బజార్ పోలీస్ బృందం మలక్‌పేటపై దాడి చేసి, పరారీలో ఉన్న రౌడీ షీటర్‌ను విజయవంతంగా అదుపులోకి తీసుకుంది. నకిలీ పద్ధతుల్లో గుర్తింపు పత్రాలను మార్చిన అంశంపై విడిగా మరో విచారణను కూడా ప్రారంభించారు. సుల్తాన్ బజార్ పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. సుల్తాన్ బజార్ డివిజన్ ఏసీపీ పర్యవేక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సుల్తాన్ బజార్ ఎస్హెచ్ఓ జి. నరేష్, ఎస్సై పి. సాయిరామ్, పీసీ ఎల్. చందన్ సింగ్, బి. సందీప్ గౌడ్, పి. నాగార్జునలను హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు.

# గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు కార్పొరేట్ తరహా పచ్చదనం , ఆధునిక వసతులు ప్రారంభం












**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో మే 28 (పీపుల్స్ న్యూస్):** గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో మేలైన పరిపాలనా ప్రమాణాలు, పారదర్శక సేవలు అందించాలని డీసీపీ రక్షిత కృష్ణమూర్తి అన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. గురువారం గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు కార్పొరేట్ తరహా పచ్చదనం , ఆధునిక వసతులను డీసీపీ రక్షిత కృష్ణమూర్తి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ స్టేషన్‌లో మేలైన పరిపాలనా ప్రమాణాలు, పారదర్శక సేవలు , అత్యాధునిక మౌలిక వసతులకు గుర్తింపుగా గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు ప్రతిష్టాత్మకమైన ISO 9001:2015 సర్టిఫికేషన్ కూడా 3 నెలల క్రితం లభించిందన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఇన్‌స్పెక్టర్) ఎన్. బోస్ కిరణ్ ప్రత్యేక శ్రద్ధతో, ఈ పోలీస్ స్టేషన్ ఆవరణను పర్యావరణహితంగా, పచ్చదనంతో కార్పొరేట్ స్థాయిలో సరికొత్తగా తీర్చిదిద్దారన్నారు. కార్పొరేట్ శైలిలో సేవలందించేందుకు ప్రణాళికాబద్ధంగా చేపట్టిన పనులు ఐఎస్ఓ సర్టిఫికేషన్‌కు దారితీశాయన్నారు. సరికొత్త రూపురేఖలు సంతరించుకుని, ఐఎస్ఓ గుర్తింపు పొందిన అనంతరం డీసీపీ, అదనపు డీసీపీ (అడిషనల్ డీసీపీ) జె. నరసయ్య , ఏసీపీ ఎ. యాదగిరి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

**ఐఎస్ఓ గుర్తింపునకు కారణమైన కీలక మార్పులు -- ఆధునీకరణ:**

స్టేషన్ రైటర్ కార్యస్థలం, సబ్ ఇన్‌స్పెక్టర్ డెస్క్ మరియు స్వాధీ నం చేసుకున్న సామగ్రి భద్రపరిచే గదులలో పేరుకుపోయిన పాత దస్త్రాలను, ఎఫ్ఐఆర్ సూచికలను నియమ నిబంధనల ప్రకారం క్రమపద్ధతిలో అమర్చి సరికొత్త రూపాన్ని తెచ్చారు. భవనానికి రంగులు వేయించి, ఆధునిక ఎల్ఈడీ లైట్లను అమర్చారు. పాత పైపుల లీకేజీలను అరికట్టి, పటిష్టమైన నీటి నిరోధక (వాటర్ ప్రూఫింగ్) పనులను పూర్తి చేశారు.స్టేషన్ పరిసరాల్లో, రోడ్డుపై ఇరుకుగా పేరుకుపోయిన పాత, పాడుబడిన మరియు జప్తు చేసిన వందలాది వాహనాలను పూర్తిగా తొలగించి, ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలో అమర్చడం ద్వారా విశాలమైన స్థలాన్ని అందుబాటులోకి తెచ్చారు.స్టేషన్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం తగినంత ఫర్నిచర్‌తో కూడిన ప్రత్యేక స్వాగత కేంద్రం (రిసెప్షన్) , సిబ్బంది విశ్రాంతి గదులను ఆధునీకరించారు. స్టేషన్ సరిహద్దు గోడల వెంట, జెండా ఎగురవేసే ప్రాంతంలో నిలువుగా ఆకర్షణీయమైన కుండీలను ఏర్పాటు చేసి, వివిధ రకాల ఆకుపచ్చని మొక్కలను నాటారు. చెట్ల కొమ్మలను క్రమపద్ధతిలో కత్తిరించి ఆహ్లాదక రమైన వాతావరణాన్ని సృష్టించారు.విధుల్లో అత్యంత అంకిత భావం చూపుతూ, గాంధీనగర్ పోలీస్ స్టేషన్ రూపరేఖలను మార్చడమే కాకుండా ఐఎస్ఓ ప్రమాణాల స్థాయికి తీసుకె ళ్లడంలో కీలక పాత్ర పోషించిన సీఐ బోస్ కిరణ్ నిబద్ధతను డీసీపీ రక్షిత కృష్ణమూర్తి , ఇతర ఉన్నతాధికారులు ఎంతగానో ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది హరీష్, నరసింహ, మౌనిక, సాయి, నయూమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జయంతి ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ పురందేశ్వరి నివాళులు



**హైదరాబాద్:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ నివాళులు అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రముఖుల రాక నేపథ్యంలో ఎన్టీఆర్ ఘాట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.పురందేశ్వరి భావోద్వేగం: మరణం లేని జననం ఎన్టీఆర్‌దని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భ ంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో ఆమె నివాళులర్పించారు. రాజకీయాలు అధికారం చెలాయించడానికి కాదు ప్రజాసేవకు ఎలా వినియోగించుకోవచ్చో నందమూరి తారక రామారావు రుజువు చేశారని పురందేశ్వరి గుర్తు చేశారు. ఈ క్రమంలో పురందేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు.'తెలుగుజాతి ఉన్నంత వరకు చిరస్మరణీయంగా ఎన్టీఆర్ చిరంజీవుడుగానే ఉంటారని నేను నమ్ముతు న్నాను. ఒక కథానాయడిగానే కాకుండా ప్రజ ాసేవలో ఎన్టీఆర్ తనదైన ముద్ర వేసుకున్నారు. రాజకీయాలు కేవలం అధికారం కోసమే కాకుండా ప్రజలకు సేవ చెయ్యడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడడానికని ఆయన రుజువు చేశారు. తారక రామారావు ఆశీర్వాదం తెలుగు వారికి ఎప్పుడూ ఉంటుంది.' – పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీఆయ ్నో ప్రభంజనం: ఈ మూడు అక్షరాల పేరు ఒక ప్రభంజనం, ఒక సంచలనం. తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఆ మహా నటుడు ప్రజల గుండల్లో సజీవంగానే ఉంటాడంటూ పలువురు ఆయనను స్మరించుకుంటున్నారు.

## కార్యకర్తలు, నాయకులకు మనోధైర్యం చంద్రబాబు, లోకేశ్: గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**అమరావతి, మే 28:** రెండో రోజు టీడీపీ మహానాడు కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో 44 ఏళ్ల టీడీపీ ప్రస్థానంపై ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రసంగించారు. 'ఎన్టీఆర్ మాకు, మనకు ఆరాధ్య దైవం. రాజకీయాల్లోకి వద్దామని అనుకుంటున్నా అని ఎన్టీఆర్ హింట్ ఇచ్చేవారు. 1982 మార్చి 28న ఆదర్స్ నగర్‌లో ప్రకటన చేశారు. పెద్ద పెద్ద వాళ్లు ఎవరు రాలేదు. సామాన్యులు మాత్రమే ఎన్టీఆర్‌కి అండగా నిలిచారు. పేదవాడు అంబలి ఇస్తే తాగేవాడు ఎన్టీఆర్. 7 నెలల పాటు తుఫాను, ఎండలు ఉన్నా ఎన్టీఆర్ పాదయాత్ర చేశారు. 9 నెలల్లో అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించారు' అని తెలిపారు. ఎన్టీఆర్ ఏ చిత్రం తీసినా 300 రోజులు ఆడేవని.. ఆ రోజుల్లోనే రాజకీయాల్లోకి వచ్చారని గోరంట్ల బుచ్చయ్య అన్నారు. సమస్యలు ఎదుర్కొని నీతివంతమైన పరిపాలన సాగించారన్నారు. నెల రోజుల్లో ఇందిరా గాంధీని ఎదిరించి అధికారంలోకి వచ్చిన నాయకుడు



ఎన్టీఆర్ అని కొనియాడారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌ను సాగు, తాగునీరు ఇచ్చే విధంగా తెలుగు గంగకు శ్రీకారం చుట్టారన్నారు. మిగులు జలాల పేరుతో తెలుగు గంగను వైఎస్ఆర్ అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎన్టీ రామారావుపై అవినీతి ఆరోపణలు చేసి కోర్టుకు రాకుండా వైఎస్ఆర్ పారిపోయారని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ పెట్టిన పథకాలను దేశమే ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగిందని చెప్పుకొచ్చారు.విజన్ 2020తో రాష్ట్ర గతిని, స్థితిని మార్చిన నాయకుడు చంద్రబాబు అని గోరంట్ల అన్నారు. ఇంత ఎండల్లో మహానాడు సాధ్యమేనా అని అనుమానం కలిగిందని.. వర్చువల్‌గా 7.5 లక్షల మంది కలిసేలా టెక్నాలజీని వినియోగించి చూపించిన నేత లోకేశ్ అని కొనియాడారు. దేశానికే దిక్సూచిగా లోకేశ్ మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పులి కడుపున పులే పుడుతుందని... పెద్ద పులి సాధువు... చిన్న పులి ఉగ్రనరసింహమన్నారు. ఈ ఉగ్రనరసింహం దెబ్బకు గొడ్డలి పార్టీ పరార్ అంటూ వ్యాఖ్యానించారు. తెలుగు జాతి ఐక్యత కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాన పాత్ర పోషిస్తున్న నేత లోకేశ్ అని తెలిపారు. మహిళలకు కేంద్రం ఇచ్చినా ఇవ్వకున్నా 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామనడం అభినందనీయ మన్నారు. కార్యకర్తలకు, నాయకులకు మనోధైర్యం చంద్రబాబు, లోకేశ్ అని చెప్పారు. ఎన్టీఆర్.. కాంగ్రెస్‌ను మట్టి కరిపించారనే అక్కసుతో పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, భారతరత్న ఇవ్వలేదని విమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అన్న ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేలా కృషి చేద్దామని గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.

## ఏపీలో కూటమి పాలనపై జేడీ లక్ష్మీనారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు.


**అమరావతి, మే 28 :** సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తిరుపతిలో పర్యటించారు.. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఏపీ ప్రభుత్వ పాలనపై ఆయన తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో స్కూళ్లు, కాలేజీలు యాక్టివ్ అయ్యాయని.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్న విద్యా ర్థులు ఉన్నత విద్యావంతులుగా మారుతున్నారని చెప్పుకొచ్చారు. పిల్లలకు అవసరమైన సౌక ర్యాలు కల్పించాలని.. వారిని మంచి బాటలో నడిపించాఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పనితీరును సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రశంసించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగయ్యాయని.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు చురుగ్గా పనిచేస్తున్నా యన్నారు. తిరుపతిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.. కీలక వ్యాఖ్యలు చేశారు రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించిన వారు ఉన్నత విద్యావంతులుగా మారుతున్నారన్నారు.. ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. పిల్లలకు ఏం కావాలన్నది ఇవ్వడం ముఖ్యమని.. అందరు కలిసి పిల్లల్ని



ఒక చక్కని బాటలో తీసుకెళ్లడం ప్రధానమైన ఉద్దేశం అన్నారు.దేశంలో డ్రగ్స్ యువతను పట్టిపీడిస్తున్న సమస్యగా మారిం దని.. డ్రగ్స్ అలవాటు పడినవారిని రిహాబిలి టేషన్ సెంటర్‌కి తీసుకెళ్లాలన్నారు లక్ష్మీనారా యణ. సమాజాన్ని డ్రగ్స్ నుంచి బయటకు తీసుకురావాలని.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలన్నారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం చాలా ముఖ్యమని.. అదే జీవితంలో విజయానికి కీలకమన్నారు లక్ష్మీనారాయణ. చిన్నతనం నుంచి పిల్లలు ఆలోచనలు, మెదడు చురుగ్గా ఉండేందుకు లక్ష్మీనారాయణ ఐదు రకాల చిట్కాలు చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.లక్ష్మీనారాయణ వరంగల్ ఎన్ఐటీలో మెకానికల్ ఇంజినీరింగ్, ఐఐటీ మద్రాస్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. 1999 మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్ అధికారి కాగా.. సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు.. ఆ తర్వాత ఆయన తన ఐపీఎస్ పదవికి స్వచ్ఛంద పదవీవిరమణ చేశారు. ఆ తర్వాత ఆయన జనసేన పార్టీలో చేరి విశాఖపట్నం నుంచి ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన జనసేన పార్టీని వీడి సొంతంగా ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఆయన మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ సంస్థలో (ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆపరేషన్స్) వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఆయన మేఘా. ఈవీ ట్రాన్స్ మేఘా గ్రూప్‌లోని విద్యుత్తు వాహనాలకు సంబంధించిన సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ అనుబంధ సంస్థ. ఈవీ ట్రాన్స్ సంస్థ ద్వారా విద్యుత్ బస్సులకు అవసరమైన ఛార్జింగ్ వ్యవస్థతో పాటుగా బస్సుల నిర్వహణ చూస్తోంది.లల్సిన అవసరం ఉందన్నారు లక్ష్మీనారాయణ.

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం

**అమరావతి, మే 28 :** ఏపీలో సంచలనం రేపుతున్న మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ కేసులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన కేవీఎన్ఆర్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. దీంతో ఆయన (గురువారం) విచారణకు హాజరయ్యారు. నిన్న కూడా సిట్ అధికారులు జగన్ పీఏను విచారించిన విషయం తెలిసిందే. ఈ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. మద్యం కుంభకోణంలో భారీస్థాయిలో అక్రమాలు జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో లిక్కర్ ముఠా, వైసీపీ అధినేత మధ్య కెవిఎన్ఆర్ కీలక వారధిగా వ్యవహరించారని సిట్ అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు సమగ్రంగా విచారిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, కీలక వ్యక్తులతో సంబంధాలు, అనుమానాస్పద ఒప్పందాలపై సిట్ అధికారులు కేవీఎన్ఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. రెండోరోజు విచారణలో కూడా పలు కీలక అంశాలపై అధికారులు సమాధానా




లు రాబడుతున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం వరకు విచారణ కొనసాగనుంది.అనంతరం ఆయనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ మద్యం కుంభకోణం కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పరస్పర ఆరోపణలు కొనసాగుతున్నాయి. ఈ కేసులో మరికొంతమంది కీలక వ్యక్తుల పేర్లు బయటకు వచ్చే అవకాశముందని సిట్ అధికారులు చెబుతున్నారు. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠత నెలకొంది.

## చంద్రబాబు బూట్లు తుడిచి మాట్లాడు.. కొడాలి నానిపై ఎమ్మెల్యే రాము ఫైర్



**కృష్ణా జిల్లా, మే 28:** మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నానిపై గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. (గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు బూట్లు తుడిచిన తర్వాతే కొడాలి నాని రాజకీయాల గురించి మాట్లాడాలన్నారు. 'ప్రస్తుత పరిస్థితిలో కొడాలి నాని కార్పొరేటర్‌గా కూడా గెలవలేడు.. ఇది నా చాలెంజ్' అని ఎమ్మెల్యే అన్నారు. గుడివాడ ప్రజలు 53 వేల ఓట్ల తేడాతో ఓడించిన కొడాలి నానికి ఇంకా బుద్ధి రాలేదని వ్యాఖ్యానించారు. విజయవాడలో మీడియా ముందు మాట్లాడడం కాదని.. దమ్ముంటే గుడివాడ రావాలని సవాల్ విసిరారు. చేతనైతే గుడివాడ ప్రజలకు సాయం చేసి చూపించాలన్నారు. గుడివాడలో నాని సీటు ఖాళీ అని.. అలాంటి వ్యక్తి గురించి మాట్లాడడం దండగ అంటూ వెనిగండ్ల రాము వ్యాఖ్యానించారు. గుడివాడ ప్రజలు కొడాలి నానిని మరిచిపోయి చాలా కాలం అయిందన్నా రు. రాజకీయాలలో కొంతమందిని ఎన్నిసార్లు అవమానించినా సిగ్గు లేకుండా మీడియా ముందుకు వస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. సమాజం ఛీ కొడుతున్నా కొడాలి నాని సిగ్గు శరం లేకుండా విమర్శలు చేస్తున్నారన్నారు. మోదీ, చంద్రబాబు స్థాయి ఏంటి.. కొడాలి నాని స్థాయి ఏంటి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలలో ఏం సాధించావని విమర్శలు చేస్తున్నావని మాజీ మంత్రిని ప్రశ్నించారు. పేపర్ మీద రాసిన స్క్రిప్ట్ లేకుండా మాట్లాడలేని జగన్ ఎక్కడ.. రాజకీయ పరిజ్ఞానం కలిగిన చంద్రబాబు, మోదీ ఎక్కడ అని రాము అన్నారు. 'అమరావతిపై మాట మార్చిన వ్యక్తి జగన్.. ఈగాలికి వదిలేశారని విమర్శించారు. వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో విడుదల చేసిన బుక్ లెట్ ప్రతి గడప గడపకు ఇస్తామన్నారు మాజీ మంత్రి రోజా.

## 'ఆరోజు వారంతా రేవంత్ రెడ్డిని ఢిల్లీలో కలిశారు.. గతంలో జగన్ చెప్పినట్లే జరిగింది'

**అమరావతి, మే 28 :** తెలుగుదేశం పార్టీ హైబ్రిడ్ మహానాడు అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు మాజీ మంత్రి రోజా. మహానాడు స్టేజ్‌ల మీద రికార్డింగ్ డాన్సులు పెట్టి ప్రజలు తీసుకొచ్చే ఎత్తుగడలు వేశారని ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలు కూడా మహానాడును పట్టించుకోవం లేదని ఎద్దేవా చేశారు.. ఇది మహానాడు కాదు దగానాడని ప్రజలకు అర్ధమైందన్నారు. మహానాడు వేదికపై టీడీపీ నేతల భాష, బాడీ లాంగ్వేజ్ అసహ్యంగా ఉందని.. ఇది సైకిల్ పార్టీ మహానాడా?.. సైకో పార్టీ మహానాడా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ కాలి గోటికి సరిపోని వారు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానాడులో వైఎస్ జగన్ నామస్మరణ చేశారని.. ఆయన పేరు చెబితేనే టీడీపీ నేతలకు వెన్నులో వణుకు పుడుతోందన్నారు. గొడ్డలి పార్టీ వైఎస్సార్‌సీపీ కాదు టీడీపీనే అన్నారు రోజా.. వివేకా హత్యకేసు నిందితుడు దస్తగిరి, టీడీపీకి సంబంధించిన లాయర్ ఒక్కరేనని విమర్శించారు. వివేకా




హత్యలో టీడీపీ హస్తముందని ఆరోపించారు.వైఎస్ జగన్ మహిళా పక్షపాతిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన చేశారని.. చంద్రబాబు మాత్రం మహిళా కక్షపాతి అన్నారు రోజా. చంద్రబాబు మహానాడు వేదికగా రెండు నాలుకల ధోరణి ప్రదర్శించారన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టే రోజే టీడీపీ మహిళా నేతలంతా ఢిల్లీకి వెళ్లారని.. బిల్లు వీగిపోయిన తర్వాత సాయంత్రం పార్టీ చేసుకున్నా రని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న ద్రోహులన్నారు. మహిళా బిల్లు వీగిపోవడానికి కారణమైన కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పార్టీకి వారు హాజరయ్యారన్నారు. కాంగ్రెస్‌తో టీడీపీకి హాట్‌లైన్ బంధముందని జగన్ చెప్పారని.. ఉదయం బీజేపీతో బ్రేక్‌ఫాస్ట్, సాయంత్రం కాంగ్రెస్‌తో డిన్నర్ అంటూ టీడీపీని టార్గెట్ చేశారు.కూటమిని ఎన్నికల హామీల గురించి ప్రశ్నిస్తేప్రశ్నిస్తే తల్లి, చెల్లి, గొడ్డలి పార్టీ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని రోజా మండిపడ్డారు. చంద్రబాబు హెరిటేజ్ ఆస్తుల్లో తల్లికి, చెల్లికి ఎంత వాటా ఇచ్చార చెప్పాలని.. ఆయన అసలు తల్లితో, చెల్లితో ఉన్న ఒక్క ఫోటో బయట పెట్టాలన్నారు. వైఎస్ జగన్ తన చెల్లికి దేశంలో ఎవ్వరు ఇవ్వని ఆస్తి ఇచ్చారన్నారు. వైఎస్ వివేకా హత్య గురించి అధికారంలో ఉన్న చంద్రబాబును సునీత, షర్మిల ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు.మంత్రి లోకేష్ రైమింగ్ కోసం చౌకబారు మాటలు మాట్లాడటం తగ్గించుకోవాలన్నారు రోజా. మూడు నెలల్లో లక్షా 30వేల ఉద్యోగాలు ఇచ్చారని.. లోకేష్ 15వేల టీచర్ పోస్టుల్ని అమ్ముకున్నారని ఆరోపించారు. సుగాలి ప్రీతి పేరు చెప్పి అధికారంలోకి వచ్చారని.. ఆమెకు వెంటనే న్యాయం చేయాలన్నారు. ఈ రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీనలు గాలికి వదిలేశారని విమర్శించారు. వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో విడుదల చేసిన బుక్ లెట్ ప్రతి గడప గడపకు ఇస్తామన్నారు మాజీ మంత్రి రోజా.

## రాయలసీమ జీవనాడి హంద్రీనీవాను పూర్తి చేసిన ఘనత చంద్రబాబుదే'

**అమరావతి, మే 28 :** సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు దూరదృష్టి అమోఘమని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. నీటిపారుదల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వాలే పునాది వేశాయని పేర్కొన్నారు. జలం ఉన్న చోటే నాగరికత అభివృద్ధి చెందిందని తెలిపారు. (గురువారం) మంగళగిరి లోని టీడీపీ కార్యాలయంలో జరిగిన మహానాడులో 'నీటిపారుదల అభివృద్ధి – నదుల అనుసంధానం'పై మంత్రి నిమ్మల మాట్లాడారు. పల్లెల నుంచి పట్టణాల నుంచి.. మహానగరాలుగా అభివృద్ధి చెందిన పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. ఈ సత్యాన్ని గ్రహించే.. అనాడు మాజీ సీఎం ఎన్టీఆర్ దగ్గర నుంచి.. నేటి చంద్రబాబు వరకు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. జగన్ హయాంలో హంద్రీనీవా పనులు ముందుకు సాగలేదు..రాష్ట్ర ఇరిగేషన్ శాఖ గురించి మాట్లాడాల్సి వస్తే.. తెలుగుదేశం పార్టీకి ముందు.. ఆ తర్వాత అనే విధంగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.




జగన్ హయాంలో ఇరిగేషన్ శాఖను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. రూ.18 వేల కోట్ల అప్పులు మిగిల్చారని మండిపడ్డారు. హంద్రీనీవా రాయలసీమ జీవనాడి అని.. అలాంటి హంద్రీనీవా గత ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదని అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫేజ్--1ను పూర్తి చేసి.. 727 కిలోమీటర్లకు సీఎం చంద్రబాబు కృష్ణ జలాలను తీసుకువెళ్లారని ప్రస్తావించారు.తుంగభద్ర ప్రాజెక్టు గేట్లను పట్టించుకోలేదు..తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ప్రమాదభరితంగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తే.. గొడ్డలిపార్టీ కనీసం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. 2024లో తుంగభద్ర ప్రాజెక్టులోని 19వ గేటు కొట్టుకుపోతే కర్ణాటక ప్రభుత్వం కూడా ఏం చేయలేకపోయిందని చెప్పారు. సీఎం చంద్రబాబు అప్పటికప్పుడు జలాశయాల ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్యనాయుడుకి ఫోన్ చేశారని వివరించారు. వరద కొనసాగుతుండగానే గేటు పునర్నిర్మాణం చేసి 80 టీఎంసీల 4లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నీటిని సముద్రం పాలు కాకుండా చూశారని అన్నారు. రాయలసీమ బిడ్డనని చ్చు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అదే రాయలసీమకు ఎందుకు గొడ్డలి పోటు వేశారో సమాధానం చెప్పాలని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు.

## వడదెబ్బ బాధితుల కోసం కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు




**విశాఖపట్నం, మే 28:** వడదెబ్బ బాధితుల కోసం కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశామని కేజీహెచ్ సూపరింటెండెంట్, డాక్టర్ వాణి తెలిపారు. ఈ వార్డులో ఏసీతో పాటు,18 బెడ్స్ ఉంటాయన్నారు. క్రిటికల్ కేసుల కోసం భావనగర్, రాజేంద్రప్రసాద్ వార్డులలో మరికొన్ని బెడ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు క్రిటికల్ కేసులు ఏవీరాలేదని చెప్పుకొచ్చారు. ఒకటి ఆరా కేసులు వచ్చినా వారికి తగిన చికిత్స అందించి పంపిస్తున్నామని తెలిపారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణీలకు వడదెబ్బ ఎక్కువగా తగులుతుందని.. వీరు చాలా జాగత్తగా ఉండాలని సూచించారు.వడదెబ్బ తగలకుండా ఉండేందుకు కేజీహెచ్‌లో నాలుగు పాయింట్స్ వద్ద చల్లని మజ్జిగ పంపిణీ చేస్తున్నామని డాక్టర్ వెల్లడించారు. స్వచ్ఛమైన తాగునీరును అందుబాటులో ఉంచామన్నారు. దాహం వేసినా, వేయకపోయినా మంచినీళ్లు తాగాలని.. చల్లటి మజ్జిగ, నిమ్మం ్సం తీసుకోవాలని ప్రజలకు సూచనలు చేశారు. ఎండాకాలంలో లేత వర్ణం దుస్తులు, వదు లుగా ఉండే కాటన్ దుస్తులు ధరిస్తే.. వడదెబ్బ తగలదని కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి పేర్కొన్నారు.

# సిద్ధరామయ్య ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ మీట్ కాళ్లు మొక్కిన డీకే శివకుమార్ సీఎం రాజీనామా చేస్తారని హోంమంత్రి ప్రకటన

**కర్ణాటక:** కర్ణాటకలో నాయకత్వ మార్పు ఉంటుందని తెలుస్తోంది. అధిష్ఠానం సూచన మేరకు సిద్ధరామయ్య సీఎం పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మంత్రులు, ఎమ్మెల్యేలకు తన నివాసంలో సిద్ధరామయ్య అల్పాహార విందు ఇచ్చారు. ఇందులో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్, సిద్ధరామయ్యను ఆలింగనం చేసుకున్నారు. సిద్ధరామయ్య కాళ్లకు నమస్కరించిన డీకే శివకుమార్ ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.సీఎం ఎవరు అవుతారో! అదే సమయంలో సిద్ధరామయ్య రాజీనామాపై కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేస్తారని తెలిపారు. రాజీనామాకు ముందు మంత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపేందుకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు ఆహ్వానించారని వెల్లడించారు. తదుపరి సీఎం ఎవరు అవుతారో వేచిచూద్దామని మంత్రి పరమేశ్వర అన్నారు. ఏ నిర్ణయమైనా పార్టీ అధిష్ఠానం తీసుకుంటుందని తెలిపిన ఆయన, సిద్ధరామయ్య రాజ్యసభకు వెళ్తారనే అంశంపై తనకు సమాచారం లేదని



చెప్పారు. గవర్నర్ అందుబాటులో లేకున్నా! అయితే రాజీనామా సమర్పించేందుకు సిద్ధరామయ్య గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు వార్తలు వచ్చాయి. కానీ గవర్నర్ తన స్వస్థలం ముంబయికి వెళ్లినట్లు సమాచారం. దీంతో నాయకత్వ మార్పు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు నెలకొన్నాయి. గవర్నర్ అందుబాటులో లేకున్నా సిద్ధరామయ్య రాజీనామా ప్రక్రియ కొనసాగుతుందని సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. రాజీనామాను గవర్నర్ కార్యాలయంలో సమర్పిస్తారని వెల్లడించాయి. లోక్‌భవన్ కార్యదర్శికి అందజేయవచ్చా? కానీ అంతలోనే లోక్‌భవన్ అధికారులు కీలక ప్రకటన చేశారు. సీఎం సిద్ధరామయ్య ఇప్పటివరకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరలేదని వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ మధ్యప్రదేశ్‌లోని తన స్వస్థలమైన ఇండోర్‌లో ఉన్నట్లు లోక్‌భవన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఒకవేళ ముఖ్యమంత్రి తన రాజీనామా పత్రాన్ని లోక్‌భవన్ కార్యదర్శికి అందజేయవచ్చా అని ప్రశ్నించగా, ఇవ్వొచ్చని బదులిచ్చారు. సీఎం స్వయంగా వచ్చి రాజీనామా సమర్పించాలని గవర్నర్ కోరే అవకాశం కూడా ఉందని ఆయన వివరించారు.రాజ్యసభ సీటు నాకొద్దు!కాగా, సీఎం పదవి నుంచి వైదొలగనున్న నేపథ్యంలో సిద్ధరామయ్యకు కాంగ్రెస్ రాజ్యసభ సీటు ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఎంపీగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధరామయ్య ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లకుండా మరో రెండేళ్లపాటు ఎమ్మెల్యేగానే కొనసాగాలని ఆయన నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.డీకే ఇంటి వద్ద సంబరాలుఅదే సమయంలో డీకే శివకుమార్ సీఎం అవుతారాన్న ఊహాగానాలు నెలకొనడంతో ఆయన నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. అక్కడికి వచ్చిన వారికి ఆయన అభిమానాలు స్వీట్లు పంచుతున్నారు. సీఎం డీకే శివకుమార్ అని రాసి ఉన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.కొన్నిరోజులుగా చర్చలునాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం రెండ్రోజుల క్రితం సిద్ధరామయ్య, డీకేలతో చర్చలు జరిపింది. ఒప్పందం ప్రకారం సీఎం పదవిని డీకేకు అప్పగించాలని కాంగ్రెస్ అగ్రనేతలు సిద్ధరామయ్యకు సూచించారు. సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపే అవకాశం ఉంది. ప్రస్తుత మంత్రివర్గాన్ని రద్దు చేసి కొత్త మంత్రివర్గం ఏర్పాటు చేస్తామని డీకే వర్గం అంటోంది. శనివారం సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం ఉండొచ్చని సమాచారం. అయితే ఆయన 2023 మే 20న కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు సిద్ధరామయ్య. మొత్తం 224 స్థానాలకుగాను కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో 135 సీట్లను గెలుచుకుంది.

# కేరళంలో ఈడీ బృందంపై దాడి కేసు.. 8 మంది అరెస్ట్



**కేరళం:** మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంలో ఈడీ రెయిడ్స్ సందర్భంగా అధికారులపై దాడికి యత్నించిన 8 మందిని అరెస్టు చేశామని రాష్ట్ర పోలీస్ చీఫ్ ఎ. చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇతర నిందితులను ఇప్పటికే గుర్తించామని కూడా తెలిపారు. హోం మంత్రి రమేశ్ చెన్నితాలతో సమావేశం అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి ఆదేశించారని అన్నారు. బుధవారం ఈడీ రెయిడ్స్ గురించి తెలియగానే భారీ స్థాయిలో పోలీసులను పంపించామని కూడా పోలీస్ చీఫ్ తెలిపారు. 'తాము వస్తున్నట్టు ఈడీ అధికారులు ముందుగా మాకు చెప్పలేదు. కానీ ఆపరేషన్ మొదలవగానే మేము భద్రత కోసం సెక్యూరిటీని పంపించాము' అని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకూ కేరళ పోలీసులు దాదాపు 300 మందిపై కేసులు పెట్టారు. అనుమతిలేకుండా గుమిగూడటం, ప్రభుత్వ అధికారులపై దాడి, అక్రమ నిర్బంధం, హత్యాయత్నం తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. మ్యూజియమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఈడీ అధికారులపై నిందితులు కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో ఒక అధికారి చేయికి గాయమైంది. ఈడీ వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ దాడిలో కారు డ్రైవర్ కూడా గాయపడ్డారు. పరిస్థితి అదుపు ప్రయత్నించిన కేరళ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులను నిరసనకారులు టార్గెట్ చేశారు.

# సీబీఎస్ఈ మూల్యాంకనంలో తప్పులు దొర్లాయి

**న్యూఢిల్లీ, మే 28:** సీబీఎస్ఈ ఫలితాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక ప్రకటన చేశారు. సీబీఎస్ఈ మూల్యాంకనంలో తప్పులు దొర్లినట్టు అంగీకరించారు. ఆ తప్పుల కు తానే బాధ్యత వహిస్తున్నానని ధర్మేంద్ర ప్రకటించారు. సీబీఎస్ఈ 12వ తరగతి పత్రాల రీ-వాల్యుయేషన్‌కు ఆదేశించారు. విద్యార్థులెరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఓఎస్ఎమ్ విధానంలో లోపాలున్నా యని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు, రీవాల్యుయేషన్ ప్రక్రియలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ ఏడాది సీబీఎస్ఈ ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంలో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. పరీక్షలు రాసిన 17లక్షల మంది విద్యార్థుల్లో ఏకంగా



4,04,319 మంది తమకు సంబంధించిన జవాబు పత్రాల స్కాన్ కాపీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జవాబు పత్రాల స్కాన్ కాపీల్లో చాలా వరకు పత్రాలు అస్పష్టంగా (బ్లర్) కనిపిస్తుండగా.. మరి కొంతమంది విద్యార్థులకు ఏకంగా వేరొకరి జవాబు పత్రాలు దర్శనమిస్తున్నాయి.

# చంద్రబాబు నాయకత్వంలో ఎన్టీఆర్ కలలు సాకారం

**న్యూఢిల్లీ,** ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళి అర్పించారు. పేద, అణగారిన వర్గాలకు గౌరవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకితభావం నేటికీ ప్రజల హృదయాల్లో శాశ్వత స్ఫూర్తిగా నిలిచిందన్నారు. చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన సేవలు తరతరాలకు గుర్తుంటాయన్నారు. ఎన్టీఆర్ జీవితం, ఆశయాలు అసంఖ్యాకమైన వ్యక్తులకు అపారమైన స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని కొనియాడారు. చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజల కోసం ఆయన కలలను సాకారం చేయడానికి కట్టుబడి ఉందని 'ఎక్స్' వేదికగా తెలిపారు.యుగ పురుషుడికి చంద్రబాబు శ్రద్ధాంజలి : ఎన్టీఆర్? 103వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నివాళులర్పించారు. కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు, మహాపురుషులౌతారు అనే మాటకు నిలువెత్తు నిదర్శనం అన్న ఎన్టీఆర్ అని చంద్రబాబు కొనియాడారు.1923 మే 28న కృష్ణా జిల్లా



నిమ్మకూరులో జన్మించిన ఆయన తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన కారణజన్ముడన్నారు. సినీ వినీలాకాశంలో రాముడుగా, కృష్ణుడుగా చెరగని ముద్ర వేసిన ఆయన రాజకీయ రంగంలో ధ్రువతారగా వెలిగారని తెలిపారు. తెలుగు ప్రజల జీవితాల్లో పెను మార్పులు తెచ్చిన ఆధునిక సంఘ సంస్కర్త ఎన్టీఆర్ అన్నారు. ఆ యుగ పురుషుడికి చంద్రబాబు శ్రద్ధాంజలి ఘటించారు.తాతా మీరే తెలుగు ప్రజల కీర్తి – లోకేశ్ : తెలుగుజాతి ఆత్మగౌరవంగా తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఎగురవేశారని మంత్రి లోకేశ్ అన్నారు. అణగారిన వర్గాలకు అండగా పసుపు జెండాని నిలబెట్టారని తెలిపారు. మహిళా సాధికారతకు బాటలు వేశారన్నారు. ప్రజల కోసం ప్రగతి కోసం తెలుగుదేశం పార్టీని అంకితం చేశారని లోకేశ్ గుర్తుచేశారు. సంక్షేమానికి చిరునామా ఎన్టీఆర్ అన్నారు. అన్నా అంటే నేనున్నానంటూ ఆదుకున్నారని గుర్తుచేశారు. కోట్లాది హృదయాల్లో కొలువైన మరణంలేని మహా మనిషి ఎన్టీఆర్ కు లోకేశ్ జోహార్లు తెలిపారు. తాతా మీరే తెలుగు ప్రజల కీర్తి మీరే తమకు నిత్యనూతన స్ఫూర్తి అంటూ లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.ఎన్టీఆర్‌ది మరణం లేని జననం – ఎన్టీఆర్?దని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రాజకీయాలు అధికారం చెలాయించడానికి కాదు ప్రజాసేవకు ఎలా వినియోగించుకోవొచ్చో ఎన్టీఆర్ రుజువు చేశారని పురందేశ్వరి గుర్తుచేశారు.ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ నివాళులు : ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ నివాళులు అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రముఖుల రాక నేపథ్యంలో ఎన్టీఆర్ ఘాట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# దేశవ్యాప్తంగా ముగిసిన బక్రీద్ ప్రార్థనలు.. మత సామరస్యాన్ని చాటిన వేడుకలు

**న్యూఢిల్లీ, మే 28:** త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈద్-ఉల్-అజ్హా (బక్రీద్) పండుగను దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలు (గురువారం) నాడు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకుంటున్నారు. ఉదయాన్నే మసీదులు, ఈద్గాలకు భారీ సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) నిర్వహించారు. దేశంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు, స్థానిక యంత్రాంగాలు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాయి.ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రత -- సోదరభావం చాటిన భక్తులుఢిల్లీలోని చారిత్రాత్మక జామా మసీదు, ఫతేపురి మసీదులతో పాటు ప్రధాన ఈద్గాల వద్ద నమాజ్ కోసం వేలాది మంది భక్తులు గురికూడారు. ప్రార్థనల అనంతరం భక్తులు ఒకరినొకరు కౌగిలించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జామా మసీదుకు వచ్చిన ఒక భక్తుడు మాట్లాడుతు.. 'మేము ఇక్కడి నుంచి సోదరభావం అనే సందేశాన్ని అందిస్తున్నాం. దేశ పురోగతి,




శాంతి, ఐక్యత కోసం అల్లాను ప్రార్థించాము' అని తెలిపాడు.ఢిల్లీ జాయింట్ పోలీస్ కమిషనర్ మధుర్ వర్మ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ.. ఇప్పటివరకు పండుగ వేడుకలు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా అత్యంత ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు. మిశ్రమ జనాభా ఉన్న ప్రాంతాల్లో ముందస్తుగా ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించామని, పండుగ ఆచారాల్లో భాగమైన బలి (ఖుర్బానీ) ప్రక్రియను నిబంధనల ప్రకారం ఇళ్ల లోపల (ఇండోర్స్) మాత్రమే నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో గంగా-జమునా తెహజీబ్ (మత సామరస్యం) ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో హిందూ-ముస్లింల మధ్య ఉన్న శతాబ్దాల నాటి మత సామరస్యం మరోసారి వ్యక్తమైంది. ఇక్కడి ఒక స్థానిక దేవాలయం, ఈద్గా ఒకే ఉమ్మడి గోడను పంచుకుంటున్నాయి. ఆలయ నిర్వాహకుడు ఓం ప్రకాష్ మాట్లాడుతూ.. 'తరతరాలుగా ఇక్కడ హిందూ, ముస్లింలు ఎంతో సామరస్యంగా జీవిస్తున్నారు. ఒకవైపు ఆలయంలో పూజలు, మరోవైపు ఈద్గాలో నమాజ్ ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా జరుగుతాయి' అని పేర్కొన్నారు. యూపీ వ్యాప్తంగా శాంతి కమిటీలతో ముందస్తు సమావేశాలు నిర్వహించామని, భద్రత కోసం 46 మంది అడిషనల్ ఎస్పీలు, 14 మంది డిప్యూటీ ఎస్పీలతో పాటు సుమారు 1,500 మందికి పైగా పోలీసు సిబ్బందిని రంగంలోకి దించినట్లు లీగల్ అండ్ ఆర్డర్ జాయింట్ పోలీస్ కమిషనర్ బబ్లూ కుమార్ తెలిపారు.పండుగ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో మత సామరస్యం ఉట్టిపడింది. ముస్లిం సోదరులకు హిందూ బంధువులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నమాజ్ పూర్తయిన తర్వాత ముస్లింలు తమ ఇళ్లలో సాంప్రదాయబద్ధంగా 'ఖుర్బానీ' (బలి) ఇచ్చి, ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి బంధువులకు, మిత్రులకు, పేదలకు పంపిణీ చేస్తూ తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా హైదరాబాద్‌తో పాటు ఇరు రాష్ట్రాల వ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన ఈద్గాల వద్ద ఉర్దూ అకాడమీ, వక్ఫ్ బోర్డ్, పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ప్రార్థనల ఘట్టం అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది.

# కారులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు.. నలుగురి సజీవ దహనం.



**రాజస్థాన్:** పెను విషాదం చోటుచేసుకుంది. కారులో మంటలు చెలరేగిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అజ్మీర్ జిల్లాలోని శ్రీ రామ్‌పుర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామ్‌సింగ్ చౌదరీ తల్లి పుశీ దేవి అనారోగ్యానికి గురైంది. పుశీ దేవి ఛాతిలో నొప్పితో బాధపడుతుండటంతో రామ్‌సింగ్ ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యాడు. భార్య సూర్యాజన్ దేవి, మేనకోడలు మహిమాతో కారులో ఆస్పత్రికి బయలుదేరాడు.ఉదయం 5.30 గంటల ప్రాంతంలో కారు ఇంటినుంచి బయలుదేరింది. అయితే, శ్రీ రామ్‌పుర దగ్గర ఊహించని దారుణం చోటుచేసుకుంది. కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ఉన్న వారు బయటకు వచ్చే అవకాశం లేకుండా క్షణాల్లో కారు మొత్తాన్ని మంటలు చుట్టుముట్టాయి. కారు డోర్లు తెరుచుకోకపోవటంతో రామ్‌సింగ్, సూర్యాజన్ దేవి, మహిమా లోపల చిక్కుకుపోయారు. మంటల్లో కాలి బూడిద అయ్యారు. అయితే, పుశీ దేవి మాత్రం కారు నుంచి తప్పించుకుని బయటకు వచ్చింది. అప్పటికే ఆమె శరీరం 60 శాతం కాలిపోయింది.తీవ్రమైన కాలిన గాయాల కారణంగా ఆమె ప్రాణాలు కోల్పోయింది. కారు మంటల్లో కాలిపోవటం గుర్తించిన స్థానికులు హుటాహుటిన కారు దగ్గరకు చేరుకున్నారు. మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పేశారు. పోలీసులు నాలుగు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ప్రమాదం జరగడానికి కారణం ఏంటో అన్వేషిస్తున్నారు.

# క్షీణించిన అమెరికా క్షిపణి సంపత్తి.. రికవరీకి కనీసం నాలుగేళ్లు



**న్యూయార్క్:** ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో అమెరికా భారీ స్థాయిలో తన ఆయుధాలను వినియోగించింది. రకరకాల క్షిపణులను అధిక సంఖ్యలో వాడింది. దీంతో ఆ దేశ క్షిపణి బాండాగారం తగ్గిపోయింది. అయితే యుద్ధం నాటి పరిస్థితులకు మళ్లీ చేరుకోవాలంటే, ఆ దేశానికి సుమారు నాలుగేళ్లు పట్టే అవకాశాలు ఉన్నట్లు కొత్త విశ్లేషణ ద్వారా తెలుస్తోంది. ఆయుధ వ్యవస్థలన్నింటినీ వాడడం వల్ల మళ్లీ వాటి పునరుద్ధరణకు చాలా సమయం పట్టే అవకాశాలు ఉన్నట్లు ఓ రిపోర్టులో తెలిపారు. ఇన్వెంటరీ క్షీణించిందని, దీని వల్ల వెస్ట్రన్ పసిఫిక్‌లో తీవ్ర సమస్యలు ఉత్పన్నం అయ్యే ఛాన్సు ఉన్నట్లు సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ పేర్కొన్నది.ప్రస్తుతానికి ఇరాన్‌తో వార్‌కు కావాల్సినంత ఆయుధ నిల్వలు ఉన్నాయని, కానీ యుద్ధం కన్నా ముందునాటి పరిస్థితులకు చేరుకునే స్థాయిలో ఆయుధాలు లేవని ఆ రిపోర్టులో తెలిపారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ సమయంలో సుమారు 12 వేల టార్గెట్లను ధ్వంసం చేసినట్లు సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. అయితే ఆ దాడుల సమయంలో అమెరికా దళాలు విస్తృత స్థాయిలో ఆయుధాలను వినియోగించాయి. తోమాహాక్ ల్యాండ్ అటాక్ మిస్సైల్స్, టర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్(థాడ్), పాట్రియాట్ ఇంటర్‌సెప్టార్స్‌ను విరివిగా ఉపయోగించినట్లు సీఎస్ఐఎస్ తన రిపోర్టులో పేర్కొన్నది.

# ఎలాంటి అవకతవకలు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానన్న ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ,** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీ ఎస్ఈ) ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానం వివాదాస్పదంగా మారింది. ఈ విధానం కారణంగా తమకు తక్కువ మార్కులు వచ్చాయని, సమాధాన పత్రాలు కూడా తారుమారయ్యాయని కొందరు విద్యార్థులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, తమ డిజిటల్ మూల్యాంకన ప్రక్రియ సురక్షితమైనది, పటిష్టమైనదని అన్నారు. అలాగే ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యార్థులు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.'దీనిని రాజకీయం చేయవద్దు'దిల్లీలో సీబీఎస్ఈ అధికారులతో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, "ఎక్కడైనా పొరపాట్లు జరిగి ఉంటే వాటిని వెంటనే సరిచేస్తాం.



విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఈ వైఫల్యాలకు తాను బాధ్యత వహిస్తున్నట్లు కూడా పేర్కొన్నారు. ఈ విషయం లో విద్యార్థులు, ప్రతిపక్ష నాయకులు లేవనెత్తిన ఆందోళనల గురించి ప్రస్తావిస్తూ, దీనిని రాజకీయం చేయవద్దని ధర్మేంద్ర అందరికీ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు అదనపు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడటానికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు.సీబీఎస్ఈ మూల్యాంకన ప్రక్రియ పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల గురించి మాట్లాడుతూ, "ఏదైనా అసౌకర్యం కలిగితే ప్రభుత్వం తరపున నేనే బాధ్యత తీసుకుంటాను, ఇది రాజకీయాలు చేసే సమయం కాదని అందరినీ కోరుతు న్నాను" అని ప్రధాన్ అన్నారు.డిజిటల్? రూపంలో 98 లక్షల సమాధాన పత్రాల ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం గురించి వివరించిన ధర్మేంద్ర ప్రధాన్, ఈసారి మొత్తం 98 లక్షల సమాధాన పత్రాల కాపీలను డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఒక్కో సమాధాన పత్రంలో సగటున 40 పేజీలు ఉండటంతో మొత్తం 40 కోట్ల పేజీలను స్కాన్ చేసినట్లు చెప్పారు. "ఓఎస్ఎం విధానం అనేది ఒక ముందడుగు. ఇప్పటికే అనేక అంతర్జాతీయ సంస్థలు దీనిని అమలు చేస్తున్నాయి. విద్యార్థులకు పారదర్శకత కల్పించేందుకు ఈ వ్యవస్థను తీసుకొచ్చా" అని వివరించారు. డిజిటల్ ఇండియా, శాస్త్రీయ పురోగతికి సంబంధించిన ప్రతి అంశాన్ని కొందరు రాజకీయ కారణాలతో వ్యతిరేకిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. "రాజకీయాలు తర్వాత చేయొచ్చు. ప్రస్తుతం విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరగకుండా చూడటం ముఖ్యం. మార్కులు, వెరిఫికేషన్, రీ వాల్యుయేషన్‌లతో ఇప్పటికే ఆందోళనలో ఉన్న విద్యార్థులపై మరింత ఒత్తిడి పెంచేలా ప్రకటనలు చేయొద్దు" అని అన్ని సూచి లోపాలు గుర్తించలేదు'

# తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు !

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే ప్రక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోం



దంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొన లేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లట్లైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**• గొల్లపూడిలో ఎన్టీఆర్ విహానికి దేవినేని నివాళి • ఆత్మగౌరవాన్ని పరిచయం చేసిన మహానేత అని అంజలి**



**విజయవాడ,మే28:** మాజీ సీఎం నందమూరి తారక రామారావు 103వ జయంతిని గొల్లపూడిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొని నివాళులు అర్పించారు. ఎన్టీఆర్‌కు పూలమాలవేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడారు. ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్ అని కీర్తించారు. రాముడుగా, కృష్ణుడుగా చెరగని ముద్ర వేసి రాజకీయ రంగంలో ధ్రువతారగా వెలిగారని ప్రశంసించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ 'ఆత్మగౌరవాన్ని' పరిచయం చేసిన ధీరుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కేవలం పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడని ఉద్ఘాటించారు. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయకత్వంలో పార్టీని కాపాడి.. 44 ఏళ్లుగా బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారని దేవినేని ఉమ వ్యాఖ్యానించారు. 1994లో ఎన్టీఆర్ నాయకత్వంలో టీడీపీ ఘన విజయం సాధించడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 'మీకోసం వస్తున్నా' పాదయాత్రతో చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లి 2014లో టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చారని ప్రస్తావించారు. అసత్య ప్రచారాలతో వచ్చిన వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. గుడివాడ వైసీపీ నేతలు ఇప్పటికీ అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మహిళలను అవమానించిన, దుర్భాషలాడిన వైసీపీ నేతలకు ప్రజలే గట్టి బుద్ధి చెప్పారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని ఉద్ఘాటించారు. కూటమి ప్రభుత్వం 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి.. 23 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు వెళ్తోందని దేవినేని ఉమ తెలిపారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవ నినాదాన్ని, చంద్రబాబు ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచ వ్యాప్తంగా తెలుగు జాతికి చాటారని వెల్లడించారు. యువగళం ద్వారా లోకేశ్ మూడోతరం నాయకత్వాన్ని నిరూపించుకుని పార్టీని విజయపథంలో నడిపిస్తున్నారని చెప్పారు. నందమూరి బాలకృష్ణ హిందూపురంలో అభివృద్ధి పనులు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా మరిన్ని సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. నారా భువనేశ్వరి ఆధ్వర్యంలోని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, ఆరోగ్యం, బ్లడ్ బ్యాంక్, సంజీవని వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సమన్వయంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

# ఎన్టీఆర్‌కు ప్రధాని మోడీ నివాళి



**న్యూఢిల్లీ,మే28:** మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని ఓ పోస్టు పెట్టారు. 'మహనీయులు ఎన్టీఆర్ గారి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు. పేదలకు, అణగారిన వర్గాలకు గౌరవాన్ని కల్పించే దిశగా ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకితభావం నేటికీ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంది. చలనచిత్ర రంగానికి ఆయన అందించిన సేవలు తరతరాలను అలరిస్తూనే ఉన్నాయి. ఆయన జీవితం, ఆశయాలు ఎంతోమందికి అపారమైన స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి. నా మిత్రుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రజల కోసం ఆయన కలలుగన్న ఆశయాలను సాకారం చేయడానికి కట్టుబడి ఉంది' అని

# ఉక్రెయిన్‌తో ఎడతెగని రష్యా యుద్ధం

**• భారీగా సైనిక సంపదను కోల్పోయిన రష్యా**

**• 5లక్షల మంది సైన్యం మరణించినట్లు వార్తలు**



**మాస్కో,మే28:** రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి. మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్‌స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేక పోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించలేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.3 3కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.



# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్తతలు

**• అమెరికా దాడులకు ప్రతీకార దాడులు**

**టెహ్రాన్,మే28:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే.. అమెరికా- ఇరాన్ మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హర్మూజ్ సమీపంలో అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. అగ్రరాజ్య సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అంతేగాక, తాజా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. కానీ, అది ఎక్కడి స్థావరం అనే విషయాన్ని వెల్లడించలేదు. అయితే తమ గగనతలంపైకి క్షిపణులు, డ్రోన్‌లు దూసుకొచ్చాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు వెల్లడించాయి.

శుక్రవారం,
మే 29, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# సత్యనారాయణ వ్రతం- ఈ నియమాలు పాటిస్తే అష్టైశ్వర్యాలు ఖాయం!



సాధారణంగా కొత్తగా పెళ్లైన వధూవరులచేత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేయించడం సంప్రదాయం. అలాగే నూతన గృహప్రవేశం సమయంలో కూడా సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకోవడం ఆచారం. అలా కాకుండా ఒక నియమం ప్రకారం ప్రతి మాసంలో వచ్చే పౌర్ణమి రోజు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరిస్తే అనేక కష్టనష్టాల నుంచి ఉపశమనం లభిస్తుందని శాస్త్రవచనం. ఈ కథనంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత విశిష్టతను తెలుసుకుందాం.

**అన్ని సమస్యలకు ఒకటే పరిష్కారం**

జీవితంలో ఎంత ప్రయత్నించినా ఎదుగుదల లేకపోవడం, ఆర్థిక సమస్యలు, తలపెట్టిన పనుల్లో ఆటంకాలు, వివాహ ప్రయత్నాలు కలిసి రాకపోవడం, అనారోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు, ఆస్థి తగాదాలు, కోర్టు సమస్యలు ఇలా సమస్య ఏదైనా దానికి పరిష్కారం ఒక్కటే అని పురాణాలు చెబుతున్నాయి. అదే శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం. ప్రతి మాసంలో పౌర్ణమి తిథి వస్తుంది. 'శ్రీ సత్యనారాయణ స్వామి' వ్రతాన్ని పౌర్ణమి రోజున ఆచరించడం వల్ల విశేషమైన ఫలితాలు కలుగుతాయనేది మహర్షుల మాట. మరి ఈ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఎలా ఆచరించాలి? ఎన్ని మాసాలు ఆచరించాలి అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

**సత్యనారాయణ స్వామి వ్రతం ఎప్పుడు ప్రారంభించాలి?**

ప్రతి మాసంలో పౌర్ణమి తిథి వచ్చినప్పటికీ ఒక నియమానుసారం ఏడాది పాటు ప్రతి పౌర్ణమికి సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించాలనుకునే వారు వైశాఖ శుద్ధ పౌర్ణమి నుంచి ప్రారంభించడం మంచిది. మే 1, శుక్రవారం వైశాఖ శుద్ధ పౌర్ణమి కాబట్టి ఈ రోజు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించడం సకల శుభప్రదమని స్కంద పురాణంలో వివరించి ఉంది.

**సత్యనారాయణ స్వామి వ్రత విశిష్టత**

శ్రీ మహావిష్ణువును సత్య స్వరూపుడిగా ఆరాధించే అత్యంత పవిత్రమైన పూజ శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం. ఈ వ్రతం ఆచరించడం వల్ల కుటుంబంలో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆరోగ్య సిద్ధి కలుగుతాయని, సత్యం పలికే అలవాటు పెరుగుతుందని నమ్మకం. ముఖ్యంగా నూతన గృహప్రవేశం, వివాహం, ఇతర శుభకార్యాల సమయంలో ఈ వ్రతం చేయడం హిందూ సాంప్రదాయంలో చాలా విశిష్టమైనది. ముఖ్యంగా వైశాఖ పౌర్ణమి, కార్తీక పౌర్ణమి, మాఘ పౌర్ణమి రోజుల్లో సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తే ఇతర మాసాల్లో పున్నమి రోజుల్లో చేసిన దానికన్నా కోటిరెట్ల అధిక ఫలం లభిస్తుందని మహర్షులు చెబుతారు.

**సత్యమే దైవం**

సత్యనారాయణ స్వామి వ్రతం సత్యం, ధర్మంయొక్క ప్రాముఖ్యతను తెలుపుతుంది. "సత్యమేవ జయతే" అన్న వేద వాక్యానికి అనుగుణంగా, సత్యాన్ని ఆశ్రయించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయనే సందేశాన్ని ఈ వ్రతం అందిస్తుంది.

**అష్టైశ్వర్య సిద్ధి**

ప్రతి పౌర్ణమికి ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేసుకోవడం వల్ల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శ్రేయస్సు పొందుతారని పురాణాలు చెబుతున్నాయి.

**కష్టాలు తొలగిపోవడం**

సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఒక ఏడాది పాటు ప్రతి మాసంలో వచ్చే పున్నమి రోజు ఆచరించడం ద్వారా జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు, కష్టాలు, దరిద్రం తొలగిపోతాయని, భగవంతుని అనుగ్రహం లభిస్తుందని విశ్వాసం.

***వ్రత విధానం***

సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించడానికి ముందుగా ఒక పీటపై బియ్యం పోసి దానిపై శ్రీ సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని ప్రతిష్టించుకోవాలి. ముందుగా దీపారాధన చేసి పసుపు గణపతిని పూజించాలి. అనంతరం అష్టోత్తర శతనామాలతో సత్యనారాయణుని పూజించాలి.

**కథా శ్రవణం**

సత్యనారాయణ స్వామి వ్రతంలో ముఖ్యమైన అంశం కథా శ్రవణం. ఈ వ్రతంలో మొత్తం 5 కథలు ఉంటాయి. ఈ కథలన్నీ సత్యాన్ని పాటించడం ఎంత గొప్పదో వివరిస్తాయి. భగవంతునికైనా సరే ఇచ్చిన మాట తప్పకూడదన్న సత్యాన్ని చెబుతూ, మాట తప్పితే ఎలాంటి పరిణామాలు ఉంటాయో వ్రతమాహాత్యం తెలుపుతుంది. వ్రతంలో భాగంగా భక్తిశ్రద్ధలతో ఈ 5 కథలు వినాలి. సత్యం, రుజువర్తనం ద్వారా సకల శుభాలు, ఐశ్వర్యాలు ఎలా పొందవచ్చో ఈ కథలు మనకు తెలుపుతాయి.

**ప్రసాద మహత్యం**

సత్యనారాయణ స్వామి వ్రతానికి ఎంత మహత్యం ఉందో, ఈ వ్రతంలో స్వామికి నివేదించే ప్రసాదానికి కూడా అంతే మహిమ ఉంది. అసలు సత్యనారాయణ స్వామి వ్రతం మొత్తం చేసుకుని ప్రసాదం స్వీకరించక పోవడం కానీ, ప్రసాదాన్ని చులకన చేయడం కానీ చేస్తే ఎలాంటి అనర్ధాలు కలుగుతాయో వ్రత కథలో వివరించి ఉంటుంది. రవ్వ, పంచదారాలతో చేసే శ్రీ సత్యనారాయణ స్వామి ప్రసాదం రుచి శుచిలోనే కాదు మహిమలో కూడా ఉన్నతమైనది. అందుకే సత్యనారాయణ స్వామి ప్రసాదాన్ని అడిగి మరీ తీసుకోవాలి శాస్త్రం చెబుతోంది.సత్యనారాయణ స్వామి వ్రతం కేవలం ఒక పూజ మాత్రమే కాదు, సత్యాన్ని ఆచరిస్తూ, కష్టాలను తొలగించమని భగవంతుని శరణు వేడుకుంటూ, మానసిక ప్రశాంతతను పొందే అద్భుతమైన మార్గం. అందువలన పౌర్ణమి రోజున సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేసుకునే అవకాశాన్ని వదులుకోకూడదు.ఈ పౌర్ణమి రోజు మనం కూడా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరిద్దాం. సకల శుభాలు పొందుదాం. ఓం శ్రీ సత్యనారాయణ స్వామినే నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# మారుతి కార్లు ప్రియం: జూన్ 2026 నుంచి రూ.30వేల వరకు రేట్ల పెంపు




భారతదేశపు అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా కస్టమర్లకు షాక్ ఇచ్చింది. జూన్ 2026 నుంచి తమ అన్ని మోడళ్ల కార్ల ధరలను గరిష్ఠంగా 30 వేల రూపాయల వరకు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన రిపోర్ట్‌లో కంపెనీ ఈ మేరకు వెల్లడించింది. ముడిసరుకుల ధరలు, తయారీ ఖర్చుల భారీ పెరుగుదల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని మారుతి పేర్కొంది.

"గత కొన్ని నెలలుగా ఖర్చుల భారాన్ని తగ్గించుకోవడానికి అనేక చర్యలు తీసుకున్నాం. అయినా ఖర్చులు విపరీతంగా పెరగడంతో, ఆ భారంలో కొంత భాగాన్ని కస్టమర్లపై వేయక తప్పడం లేదు. అయితే కస్టమర్లపై ఈ ప్రభావం కనిష్ఠ స్థాయిలోనే ఉండేలా మేం చూసుకుంటాం. ధర ఎంత పెరుగుతుందనేది మోడల్‌ను బట్టి ఉంటుంది" అని కంపెనీ తన రిపోర్ట్‌లో పేర్కొంది.ప్రస్తుతం మన భారత ఆటో మొబైల్ ఇండస్ట్రీలో చాలా వరకు కార్ల తయారీ సంస్థలు తమ మోడళ్ల ధరలను పెంచుతున్నాయి. ముడిరుకుల ధరలు, రవాణా ఖర్చులు, సప్లై చెయిన్‌లో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడమే ఇందుకు కారణం. ఈ తరుణంలోనే మారుతి నుంచి కూడా ఈ ప్రకటన వెలువడింది.

ఇంతకుముందు మహీంద్రా అండ్ మహీంద్రా కూడా తమ ూఖఎలు, కమర్షియల్ వెహికల్స్ ధరలు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 6 నుంచి ఈ పెంపు అమల్లోకి వచ్చింది. పెరుగుతున్న ముడిసరుకు, నిర్వహణ వ్యయాలను కారణంగా చూపుతూ ధరలు గరిష్ఠంగా 2.5 శాతం వరకు పెరుగుతాయని, వివిధ మోడళ్లలో సగటున సుమారు 1.6 శాతం పెరుగుదల ఉంటుందని కంపెనీ తెలిపింది.ఇదిలా ఉండగా మారుతి సుజుకి ఇటీవలే తన 'మారుతి సుజుకి ఈకో' (జువఎశీ) శ్రేణిని సరికొత్త 'స్టార్ ఎడిషన్' ప్యాకేజీతో అప్‌డేట్ చేసింది. ఈ ప్యాకేజీ అసలు విలువ రూ. 37,000 అని, అయితే దీనిని ప్రస్తుతం రూ. 19,999 ప్రత్యేక ధరకే విక్రయిస్తున్నామని పేర్కొంది. ఇందులో కారు ఎక్స్?టీరియర్, ఇంటీరియర్? భాగాలకు సంబంధించిన మొత్తం 18 యాక్సెసరీలు లభిస్తాయి. ఈ కొత్త ప్యాకేజీ ధర, సాధారణ మారుతి ఈకో ధర కంటే కాస్త ఎక్కువగా ఉంది. దీని 5-సీట్ల ూజ వేరియంట్ ధర రూ. 5.54 లక్షలు (ఎక్స్-షోరూమ్) కాగా, 5-సీట్ల ూజ జచీ+ వెర్షన్ ధర రూ. 6.36 లక్షలు (ఎక్స్-షోరూమ్). ఈ స్టార్ ఎడిషన్ ఎంపిక చేసిన మారుతి సుజుకి అరీనా డీలర్‌షిప్‌ల ద్వారా విక్రయించే అవకాశం ఉంది.

# వంట నూనెను తగ్గిద్దామిలా! - పలు సింపుల్ టిప్స్ సూచిస్తున్న ఎక్స్‌పర్ట్స్



సాధారణంగా అందరూ ఆరోగ్యకరమైన ఆహారం గురించే ఆలోచిస్తారు. కానీ, హెల్దీ కుకింగ్ గురించి మాత్రం పట్టించుకోరు. ఈ క్రమంలో ఆరోగ్యకరంగా ఆహారం వండడంలో నూనె వాడకం కీలక పాత్ర పోషిస్తుంది. మామూలుగా వంటల్లో నూనె కొంచెం ఎక్కువగానే ఉంటుంది. దీంతో మనకు తెలియకుండానే తీసుకునే ఈ నూనె వల్ల ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. అందుకే, నూనె వాడకానికి సంబంధించి కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు., అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

నూనె తక్కువ/లేని వంటలు ఆరోగ్యానికి మంచివని అందరికీ తెలిసిందే. కానీ, వంటకానికి మంచి రుచి కావాలంటే మాత్రం గిన్నెలో నూనె వేయాల్సిందే. అయితే, నూనెను ఎలా పడితే అలా నీళ్లలా వాడితే మాత్రం దీర్ఘకాలంలో అనేక ఆరోగ్య సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఆయిల్ వాడకంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే రుచికరమైన ఆహారంతో పాటు ఆరోగ్యమూ సొంతమవుతుందని సూచిస్తున్నారు.

'అమ్మమ్మ'లా కనిపిస్తున్నారా? - "మీ వయస్సును దాచేసే ఫుడ్"పై నిపుణుల సూచనలునూనెను తగ్గిద్దామిలా :వేపుళ్ల బదులు బేకింగ్, స్టీమింగ్?కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. దీంతో ఆయా పోషకాలు శరీరానికి సమృద్ధిగా అందుతాయి.ఫ్రైడ్ స్నాక్స్?కి బదులు స్టీమ్ చేసిన స్నాక్స్?ను తీసుకుంటే ఆరోగ్యానికి మేలు.ఆయిల్ కాస్త తక్కువగా వాడేవారు, వంటలో పొరపాటున కాస్త ఎక్కువైతే తినడానికి ఇబ్బంది పడతారు. ఇలాంటప్పుడు నూనెను కొలత ప్రకారం వాడుకోవడమే మంచిదట. ఈ క్రమంలో బాటిల్?లో నుంచి నూనెను పోసే బదులు మెజరింగ్ స్పూన్ లాంటి వాటితో వేయాలి. అప్పుడు ఎంత నూనె వాడుతున్నామో అర్థమవుతుంది.ఎప్పుడూ ఒకే రకమైన నూనెను వాడకుండా, కాంబినేషన్ ఆయిల్స్?ను వాడితే మంచిది. ముఖ్యంగా, రైస్ బ్రాన్, నువ్వులు, సన్?ఫ్లవర్, వేరుశనగ వంటి నూనెల్లో ఉండే మోనోశ్యాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, పాలీ అన్?శ్యాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ మన శరీరానికి చాలా అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, మన బాడీ వాటిని స్వయంగా తయారు చేసుకోలేదట. వంట నూనె ద్వారానే అవి శరీరానికి అందుతాయని తెలియజేస్తున్నారు. అందుకే, వేర్వేరు నూనెల్ని కలిపి వాడుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి.ఆయిల్ వినియోగానికి సంబంధించి నెలకు ఎంత వాడుతున్నామో ఒక లెక్క వేసి చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే, ఒక అవగాహన వస్తుందట. దీన్ని బట్టి అవసరం అనుకుంటే నూనె వాడకాన్ని తగ్గించుకోవచ్చు.వేపుళ్లకి వాడిన నూనెని మళ్లీ వేయించడానికి వినియోగించకూడదు. ఇలా వాడిన నూనె వల్ల శరీరంలోకి టాక్సిన్స్ చేరే ప్రమాదం ఉంది.ఇవి కూడా :

వంట నూనెను ఎక్కువసేపు వేడి చేస్తే అందులో ఉండే పోషకాలు శరీరానికి అందే అవకాశం తక్కువ. అంతేకాదు, ఒకసారి వాడిన ఆయిల్ ఎక్కువ సార్లు ఉపయోగించకూడదు.

ఎలాంటి పరిస్థితుల్లోనూ ఒకసారి వాడిన నూనెలో తాజా నూనెను కలపకూడదు.

ఆయిల్?ను వేడి చేసినప్పుడు దాని ఉష్ణోగ్రత కూడా మారుతుంది. ఏ టెంపరేచర్ వద్ద నూనె పొగ రావడం మొదలవుతుందో దానిని స్మోకింగ్ పాయింట్ అంటారు. దీనిపై కొంచెం అయినా అవగాహన కలిగి ఉండాలంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, డీప్ ఫ్రై చేయాల్సిన అవసరం వస్తే ఎక్కువ స్మోకింగ్ పాయింట్ ఉన్న నూనెలను మాత్రమే వాడాలి.

కూకింగ్ ఆయిల్?పై సూర్యరశ్మి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే, నేరుగా ఎండ పడడం వల్ల నూనెలో కొన్ని రసాయన మార్పులు జరిగే అవకాశం ఉందట.

అలాగే, వంటనూనెను కొనే ముందు అందులో ఉన్న ఫ్యాట్ శాతం చూసి మరీ కొనాలి. నిర్ణీత మోతాదు కన్నా ఎక్కువ ఉండే ఆరోగ్యానికి ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఐదు పవిత్ర నదుల సంగమం- మహాభారతంతో అనుబంధమున్న ఈ ప్రదేశం గురించి మీకు తెలుసా?



సాధారణంగా మనకు త్రివేణి సంగమం గురించి తెలుసు అలాగే నదులు సాగరంలో కలిసే సాగర సంగమం గురించి కూడా తెలుసు. కానీ పంచ నదులు అంటే అయిదు నదులు ఒకే చోట కలిసే పంచనద సంగమం గురించి తెలుసా! మహాభారతంలో పాండవులు పవిత్ర ప్రదేశమైన ఈ పంచనద సంగమం విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**పంచనద సంగమం ఎక్కడుంది?**

సాధారణంగా ఎక్కడైనా రెండు లేదా మూడు నదుల సంగమం చూస్తాం. కానీ ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదు నదులు ఒకే చోట కలిసే అద్భుత క్షేత్రం ఉత్తరప్రదేశ్‌లో ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని ఇటావా జిల్లాలో ఉన్నఈ పంచనద సంగమం అరుదైన భౌగోళిక, ఆధ్యాత్మిక అద్భుతానికి వేదికగా నిలుస్తోంది. జలౌన్, ఇటావా జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతంలో ఐదు ప్రధాన నదులు సంగమిస్తాయి. పురాణ ప్రాశస్త్యం ఉన్న ఈ పంచనద సంగమం గురించి మరిన్ని విశేషాలు తెలుసుకుందాం.

**ఐదు పుణ్య నదుల పవిత్ర సంగమం**

ఉత్తరప్రదేశ్ లోని ఇటావా జిల్లాలోని పంచనద పవిత్ర సంగమ ప్రదేశం వద్ద యమున, చంబల్, క్వారీ, సింధ్, పహూజ్ అనే ఐదు పవిత్ర నదులు సంగమిస్తాయి. అందుకే ఈ ప్రాంతాన్ని స్థానికులు మహా సంగమం అని పిలుస్తారు. ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటకంగా కూడా ఈ ప్రాంతం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. పురాణాల ప్రకారం మహాభారత కాలంలో పాండవులు ఇక్కడ కొంతకాలం గడిపారని ప్రతీతి.

**అరుదైన సంగమం**

ప్రపంచంలోనే మరెక్కడా ఇన్ని నదులు ఒకేచోట సంగమించడం కనిపించదు. అందుకే అరుదైన ఈ పంచనద సంగమాన్ని మహా సంగమమని అంటారు. విశేషమేమిటంటే ఈ ఐదు నదులు వేర్వేరు రంగులలో స్పష్టంగా కనిపిస్తూ సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తాయి.

**పుణ్య స్నానాలు**

హిందూ సంప్రదాయం ప్రకారం పుణ్య తిథులైన అమావాస్య, పౌర్ణమి, ఏకాదశి వంటి తిథుల్లోనూ, కార్తిక, మాఘ, వైశాఖ మాసాలల్లోను, అలాగే గ్రహణ సమయాల్లోనూ ఈ పంచనద సంగమంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. అలాగే ఈ సంగమంలో కనిపించే ఐదు నదుల్లో ఏ నదికి పుష్కరాలు వచ్చినా భక్తులు ఈ సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించడానికి తరలి వస్తుంటారు.

**పురాణ ప్రాశస్త్యం**

పంచనద సంగమానికి సంబంధించిన పురాణ ప్రాశస్త్యం గురించి తెలుసుకుందాం. వ్యాస మహర్షి రచించిన మహాభారతం ప్రకారం పాండవులు తమ అరణ్య అజ్ఞాతవాస సమయంలో ఈ ప్రాంతంలో ఇక్కడ కొంత కాలం నివసించినట్లుగా తెలుస్తోంది. అంతేకాదు పంచ పాండవులలో రెండవ వాడైన భీవసేనుడు ఈ ప్రదేశంలోనే బకాసురుని సంహరించినట్లుగా పురాణం ద్వారా తెలుస్తోంది.

తులసీదాసు సంచరించిన పుణ్య ప్రదేశం

పంచనద సంగమ ప్రదేశంలోని ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడైన తులసీదాసు ఇక్కడ కొంత కాలం గడిపారని తెలుస్తోంది. ప్రశాంతమైన ఈ ప్రదేశంలోనే బాబా ముకుంద్ వనం ఆశ్రమం కూడా ఉంది.

**ప్రయాగ అంటే?**

ప్రయాగ అంటే ఒకటి కన్నా ఎక్కువ నదుల సంగమం. నదులు ఒకదానితో ఒకటి సంగమించే పవిత్ర ప్రదేశాన్ని సంగమం అంటారు. అంటే నదులు లేక నీటి ప్రవాహాలు, ఒకదానితో మరొకటి కలిసిపోయే ప్రదేశం అని అర్థం. ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ రాజ్, ఉత్తరాఖండ్‌లోని పంచ ప్రయాగ క్షేత్రాల తర్వాత ఈ ఎసంగమం కూడా అంతటి విశిష్టత పొందింది.

**మహామేళా**

ప్రతి సంవత్సరం కార్తిక మాసంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా పంచనద సంగమంలో భారీ ఎత్తున మేళా జరుగుతుంది. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఈ పంచనద సంగమ ప్రాంతంలో పవిత్ర జలాల్లో స్నానాలు ఆచరిస్తారు.

**ఆధ్యాత్మికమే కాదు పర్యాటకం కూడా**

పంచనద సంగమ ప్రదేశం ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటకంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రకృతి సౌందర్యం, ప్రశాంతమైన వాతావరణం ప్రకృతి ప్రేమికులకు మంచి పర్యాటక ప్రదేశం. ఈ ప్రదేశంలోనే చంబల్ నదిలో మాత్రమే కనిపించే మొసళ్ళు, డాల్ఫిన్లను తిలకించవచ్చు.

పంచనద క్షేత్ర దర్శనం భక్తులకు ఇటు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అనిర్వచనీయమైన ఆనందాన్ని కూడా కలిగిస్తుంది. మనం కూడా ఈ పంచనద క్షేత్రాన్ని దర్శించి ఆనందానుభూతులు సొంతం చేసుకుందాం. ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది

## గాలి వర్షానికి నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి తంబళ్ల రవి



**దమ్మపేట, మే 28:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో ఉదయం గాలివానల వల్ల నష్టపోయిన మామిడి రైతులను పరామర్శించిన బిజెపి నాయకులు తంబళ్ల రవి, వారు మాట్లాడుతూ అకాల వర్షం వల్ల మామిడి రైతులకు తీవ్ర నష్టం కలిగిందని,మామిడి రైతులను ఆదుకోవడం చాలా అవసరం,చేతికొచ్చిన పంట చేజారిపోవడంతో రైతులు ఆర్థికంగా ఎంతో కుంగిపోతారు,ఇలాంటి క్లిష్ట సమయంలో వారికి తక్షణ సాయం అందించడం ప్రభుత్వం బాధ్యత,రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే నష్టపోయిన తోటలను సందర్శించి,క్షేత్రస్థాయిలో సర్వే జరిపి నష్టాన్ని ఖచ్చితంగా అంచనా వేయాలనీ,నష్ట పోయిన రైతులకు వెంటనే న్యాయం చేయాలని బీజేపీ నాయకులు తంబళ్ల రవి డిమాండ్ చేశారు.

## ఎన్.టి.ఆర్ విగ్రహాని కి నివాళు లర్పించిన.ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**, దమ్మపేట, మే 28:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,ఉమ్మడి ఆంధ్ర పదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు, విశ్వవిఖ్యాత,నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 వ జయంతిని పురస్కరించుకొని గండుగులపల్లిలో నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ,ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వట్టి రమేష్,వేంపాటి చెన్నారావు,దొడ్డ వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాద్,ఎర్ర వసంతరావు, చీకటి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు జాతి గౌరవాన్ని చాటిన మహానేత ఎన్టీఆర్: ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**మే 28 (జీలుగుమిల్లి):** స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని జీలుగుమిల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.?ఎన్టీఆర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం:ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, స్వాభిమానం కోసం ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని, ప్రతి కార్యకర్త ఎన్టీఆర్ ఆశయాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.?పెద్ద ఎత్తున పాల్గొన్న నాయకులు:ఈ కార్యక్రమంలో ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, పోలవరం ఎస్టీ సెల్ అధ్యక్షుడు చాపా రవి, మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొన్న మాజీ జెడ్పీటిసి బత్తుల అంజి



**ములకలపల్లి, మే 28:** పాల్వంచ పెద్దమ్మ గుడి వద్ద జరిగిన ములకలపల్లి మండల కేంద్రం అంబేద్కర్ నగర్ కు చెందిన కాళ్ళ నరసింహారావు కుమార్తె నాగ స్వరూప ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొని నూతన వస్త్రాలు అందజేసి ఆశీర్వదించిన భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి, మరియు ములకలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు శనగపాటి రవి, , 2వ వార్డ్ మెంబర్ దారా రాణి అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్, యువజన కాంగ్రెస్ నాయకులు నరి మేకల, పాత్రికేయులు సాక్షి శివ, గంటా వెంకటేశ్వర్లు మరియు గొర్ల రాజు, కామేష్, మరియు తదితరుల పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలు కాల్చితే భారీ జరిమానా మండల వ్యవసాయ అధికారి బి అరుణ్ బాబు

- పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ జారీ చేసిన జీవో నెంబర్ 27 అమలు
- పంట వ్యర్థాలను కాల్చితే రూ.5 వేల నుండి 25 వేల రూపాయల వరకు జరిమానా
- పంట వ్యర్థాల దాహనంతో భూసారానికి హాని



**ములకలపల్లి , మే 28:** వానకాలం సాగుకు భూములను సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలను మరియు మొక్కజొన్న చొప్పలను కాల్చవద్దని రైతులకు విజ్ఞప్తి చేసారు .

వాటిని కాల్చడం వలన భూమికి నష్టం వాటిల్లుతుందని, పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని మరియు వాయు కాలుష్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేసవికాలంలో మంటలు వేగంగా వ్యాప్తి చెంది పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇటీవల భూపాలపల్లి జిల్లాలో రైతులు చాకర్ల చంద్రమౌళి, భాగ్యమ్మ లు పంట వ్యర్థాలు కాల్చే క్రమంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటనను గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పంట వ్యర్థాలను కాల్చడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 27 ను అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా సాధారణ చెత్తను కాల్చితే రూ.5 వేలు అదే భారీ స్థాయిలో వ్యర్థాలను తగలబెడితే రూ.25 వేల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు. రైతులు ఇలాంటి సులభమైన మార్గాలను ఎంచుకోకుండా వంట అవశేషాలను నెలలోనే కలిగి దున్నలని విజ్ఞప్తి చేశారు. ఇలా చేయడం వల్ల భూసారం పెరుగుతుందని మరియు రసాయన ఎరువుల వాడకం తగ్గి పెట్టుబడి ఖర్చు కలిసి వస్తుందని తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని తనం వల్లనే పూస పల్లి నిర్మాణంలో తీవ్ర జాప్యం సిలివేరి సత్యనారాయణ పరుచూరి వెంకటేశ్వర్లు



**ఇల్లందు న్యూస్:-** ఇల్లందు పట్టణంలోని జెకె-05 ఓసిని పునరుద్ధరించకుండా ఇక్కడ ఉన్నటువంటి కార్మికులందరినీ వివిధ ప్రాంతాలకు తరలించి సింగరేణి పుట్టినిల్లు అయిన ఇల్లందు మనుగడని ప్రశ్నార్థకంగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం వల్లనే పూసపల్లి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందని బి ఆర్ ఎస్పార్టీ తెలంగాణ ఉద్యమ నాయకులు సిలివేరి సత్యనారాయణ పరుచూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గోచికొండ సత్యనారాయణ మీరు ఎందుకు ట్రాన్స్ఫర్ అయ్యారో,జే.వెంకటేశ్వర్లు మీ మీద ఉన్న అక్రమ కేసుల సంగతి ఏంటిదో బయట పెట్టమంటారా పూసపల్లి ఓసి ని పునరుద్ధరించకుండా మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని కేవలం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబం వల్లనే పూసపల్లి ఓసి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందని వారు అన్నారు.పూసపల్లి ఓసి నిర్మాణం కేవలం పూర్తిగా కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య వైఫల్యం వల్లనే తీవ్ర జాప్యం జరుగుతుందంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేసారు.గతంలో సింగరేణి యాజమాన్యం స్ట్రట్ ఫిట్ మైన్, జెకె 5 ఓసి మూతపడుతుందని సింగరేణి పుట్టినిల్లు అయిన ఇల్లందు మనుగడని దృష్టిలో ఉంచుకొని ఆనాటి తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వాటిని పునరుద్ధరించడం జరిగిందని ఆ ఒక్క ఘనత కేవలం మా టిఆర్ఎస్ పార్టీ అనే విషయాన్ని ఐ ఎన్ టి యు సి నాయకులు గుర్తు చేసుకోవాలని అన్నారు. పూసపల్లి నిర్మాణం ఆగిపోయింది కేవలం ఎన్విరాన్మెంటల్ అనుమతి లేదనో లేదా ఫారెస్ట్ క్లియరెన్స్ లేదనో కాదని,పూసపల్లి ప్రభావిత ప్రాంతాలలో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య వారి భార్య కోరం లక్ష్మి వారి సోదరుడు కోరం సురేందర్ కోరం ఉమా పేర్లమీద ఉన్న రాయించిన భూమికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రాదని అది సెటిల్మెంట్ అవ్వలేదన్న కారణంతోనే కేవలం ఒక కుటుంబ స్వార్థం కోసం ఇల్లందు భవిష్యత్తుని ప్రశ్నార్థకంగా మారుస్తున్నారని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మా దగ్గర ఆధారాలతో సహా ఉన్నాయని, ఇక్కడ ఉన్న పూసపల్లి ఓసి లో మీరు స్వతహాగా సర్వే చేయించుకున్న ల్యాండ్ 100 ఎకరాలకు ఒక గజం తక్కువ ఉన్నా కూడా రాజీనామా చేసే ధైర్యం మీ ఎమ్మెల్యే కోరం కనకయ్య కి ఉందా అని వారు ప్రశ్నించారు. రాజీనామా చేయాల్సింది గోచికొండ సత్యనారాయణ కాదని ఇదే మాట మీ ఎమ్మెల్యే కోరం కనకయ్య ని వారి సోదరుడు కోరం సురేందర్ ని చెప్పమనండి అని సవాల్ వారు విసిరారు. వారు సర్వే చేయించుకున్న 100 ఎకరాల భూమి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రావడం లేదనే కారణంతోనే పూసపల్లి ఓసి నిర్మాణంలో అలసత్వం నిర్లక్ష్యం వహిస్తున్నారని, అంతేకాకుండా ఊరి చివర ప్రాంతాలలో ఉన్న గుట్టలను కూడా వదలకుండా సర్వే చేయించుకుని పట్టాలు చేయించుకున్న ఘనత మీదని మా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ని విమర్శించే అర్హత మీది కాదని వారు అన్నారు.హరిప్రియ చేసిన అభివృద్ధి ఏంటిది అనేదినేడు నిర్మితమవుతున్న 100 పడకల ఆసుపత్రిని చూస్తే అర్థమవుతుందన్నారు.ఒక డయాలసిస్ చూస్తే అర్థమవుతుందని, రోజు వేలాది మంది ప్రయాణించే ఇల్లందు ప్రధాన రహదారి కనిపిస్తుందని,చిరకాల వాంఛ అయిన బస్ డిపో కనిపిస్తుందని,ఇవన్నీ చూడలేని నువ్వు ఏం అభివృద్ధి చేశారని అడుగుతున్నావు అంటే నీకు కళ్ళు ఉన్నాయో ఉండి కనిపిస్తున్నాయో లేదో అర్థం కావడం లేదు అని వారు ఎద్దేవా చేశారు.మీరు అధికారంలోకి లోకి వచ్చిన ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి ఏమిటి అని సూటిగా ప్రశ్నించారు..?? గోచికొండ సత్యనారాయణ మీరు ఇల్లందు నుండి ఎందుకు బదిలీ అయ్యారు అనే విషయం తెలుసుకోకుండా అదేవిధంగా జే.వెంకటేశ్వర్లు మీ అక్రమ కేసులు అన్నీ తెలుసు ఇంకోసారి మా బిఆర్ఎస్ పార్టీ మీద మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ మీద అవాకులు చవాకులు పేలితే ఆధారాలతో సహా అన్ని విషయాలు బయట పెట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రెండు వార్డులలో టికెట్ ఆశించగా ఏ వార్డులో కూడా టికెట్ దక్కకపోయేసరికి భంగపడి మతిభ్రమించి గోచికొండ సత్యనారాయణ తన ఉనికిని కాపాడుకోవడం కోసమే ఏదో హంగు ఆర్భాటం చేస్తూ ప్రెస్మీట్ నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు.ఈరోజు మాట్లాడుతున్న మీకు కేవలం పూసపల్లి ఓసీను పునరుద్ధరించిన తర్వాతనే మీకు మాట్లాడే నైతిక హక్కు ఉంటుంది తప్ప, మీకు మాట్లాడే హక్కు ఐ ఎన్ టి యు సి నాయకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదన్నారు. టేకులపల్లి హాస్పిటల్ నిర్మితమవ్వక ముందు అక్కడ హరి సింగ్ ల్యాండ్ ఉండేదని నిర్మిత ఒక ముందే అక్కడ హరి సింగ్ పేరు మీదట భూములు ఉండేవని సింగరేణి వారి నుండి హరి సింగ్ కి భూమి వచ్చిందా హరి సింగ్ నుండి సింగరేణి భూమి వెళ్లిందా అనేది ఆధారాలతో సహా ఇప్పటికి సర్టిఫికెట్లు ఉన్నాయని తెలియజేశారు. అభివృద్ధి పేరుతో ఆరోజు పార్టీ మారిన మీ ఎమ్మెల్యే కోరం కనకయ్య వారి హయాంలో ఇల్లందు నియోజకవర్గంలో చేయించిన అభివృద్ధి పనిని ఒక్కటైనా చూయించండి అని ఆనాడు అభివృద్ధి పేరిట పార్టీ మారిన ఆనాటి ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఇల్లందుకి ఏం చేశారనేది ఇల్లందు ప్రజానీకానికి తెలుసు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కనిపించక పోయిన, ఇల్లందు ప్రజలకు తెలుసు అని గుర్తు చేశారు. మూతబడిన 30 పడకల ఆసుపత్రిని రూపాంతరం చెందించి దానిని వాడుకలోకి తీసుకువచ్చి ఇక్కడ గైనకాలజిస్ట్ ఏర్పాటు చేయించి, గర్భిణీ స్త్రీలకు ఇక్కడనే టిపా స్కానింగ్ తో పాటు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తే నేడు ఇల్లందు గర్భిణీలకు టిపా స్కానింగ్ కూడా అందుబాటులో లేని దరిద్ర పాలన నేటి కాంగ్రెస్ పరిపాలన అని దుయ్యబట్టారు. మా హయాంలో జరిగిన ఇల్లందు అభివృద్ధి గురించి మాట్లాడుకుంటూ పోతే నీకు తిరగడానికి ఇల్లందు ప్రాంతంలో మొహం కూడా ఉండదని దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో యువజన మరియు సోషల్ మీడియా నాయకులు గిన్నారపు రాజేష్, కాసాని హరిప్రసాద్,సత్తాల హరికృష్ణ, షేక్ చాంద్ పాషా ఉన్నారు.

# ఇల్లందులో ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు



**ఇల్లందు న్యూస్ :-** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తి శేషులు నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను ఇల్లందు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగు తమ్ముళ్ల మధ్య ముద్రగడ వంశి విజయలక్ష్మినగర్ సర్పంచ్ చందావత్ రమేష్ బాబు లు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి కేకును కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని అభినందనలు అభినందనలు తెలుపుకున్నారు.ఎన్టీఆర్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో బుగ్గ వాగు బ్రిడ్జి పక్కన ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ భారీ విగ్రహానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ చందావత్ రమేష్ బాబులు మాట్లాడుతూ సినీ రంగంలో నెంబర్ వన్ స్థాయిలో ఏకచత్రాధిపత్యంగా ఏలిన ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 9 నెలలలోనే ప్రజలు నిరాజనాలు పట్టి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టారని తెలిపారు. ఈ ఘనతను దక్కించుకున్నది దేశంలో ఒక్క ఎన్టీఅరే అని అన్నారు. సినీ ప్రముఖుడు గ ఉన్న ఎన్టీఆర్ ఆనాడు రాష్ట్రంలో అనేకసార్లు సంభవించిన కరువు కాటకాలకు,వర్షాలకు దిక్కుతోచని అనాధ స్థితిలో ఉన్న ప్రజలకు జోల పట్టి వసూలు చేసిన వస్తు సామాగ్రిని డబ్బులను పేదలకు పంచారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారం లో భాగస్వాములను చేసిన ఘనత ఎన్టీఆర్దేనని అన్నారు. అప్పటివరకు దేశంలో కానీ విని ఎరుగని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసిన ఉద్దండు డు ఎన్టీఆర్ అని తెలిపారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ దేశంలోనే పేరెన్నిక గల ఎన్నికల పార్టీగా అవతరించిందని ఎన్టీఆర్ కేంద్ర అధికార ప్రభుత్వ భాగస్వాముల పక్షాలకు చైర్మన్గా ఎన్నికయ్యారు అని తెలిపారు. లోకసభలో తెలుగుదేశం పార్టీ ప్రధాన ప్రతిపక్ష హోదాను సాధించిందన్నారు. లోకసభ స్పీకర్ గా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నే ఉండటం అనేది ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ గొప్పతనమేనని తెలిపారు. ఎన్టీఆర్ 1923 మే 28వ తేదీన కృష్ణాజిల్లా నిమ్మకూరు గ్రామంలో లో జన్మించారని ఆ తర్వాత సినీ రంగంలో తిరుగులేని శక్తిగా తెలుగు ప్రజల ఆధార అభిమానులు అందుకొని నటసార్వభౌమ గుర్తింపు పొందారని 59 సంవత్సరాల వయసులో సినీ రంగం నుండి బయటికి వచ్చిన ఎన్టీఆర్ తెలుగు ప్రజల కష్టాలను చూసి ఎంతో తపించిపోయి,29మర్చి 1982 లో తెలుగుదేశం పార్టీ స్థాపించి తొమ్మిది నెలల కాలంలోనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకువచ్చి బడుగు బలహీన వర్గాలకు ఎంతో ఉపయోగకరమైన పాలన అందించి బడుగులకు రాజ్యాధికారం అందించిన నేతగా గుర్తింపు పొందారని, తెలుగోడు అంటే దేశంలోనే గుర్తింపు పొంది పాలన అందించిన మహనీయుడు అని ఇలాంటి చరిత్ర కలిగిన నాయకునికి భారతరత్న ఇచ్చి గౌరవించాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తున్నామని తెలియజేశారు.పేదోడికి పట్ట దన్నం పెట్టిన చరిత్ర ఎన్టీఆర్ ది అని, నేడు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగుదేశం పార్టీ చరిష్మా నిత్యం ప్రజల గుండెల్లో ఉందన్నారు. దేశానికి రాష్ట్రానికి ఇంత సేవ చేసిన ఎన్టీఆర్ కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు, రానున్న కాలంలో తెలంగాణా రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకువస్తామని ధీమాని వారు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మైపా బాలరాజు,శ్యామ్ తివారీ, బాబు,దగ్గుల లింగయ్య,వేల్పుల ప్రశాంతి,కంది రవి,దాసరి గోపాలకృష్ణ,వాసం వినీత్, రాజేందర్

# రెండవ రోజు ఘనంగా నిర్వహించిన పసుపు పండగ ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన టిడిపి నేతలు, కార్యకర్తలు



**తుగ్గలి మే 28 :-** తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజలకు సంక్షేమ పాలన అందించిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైబల్ అడ్వైంజర్ మెం బెర్ పి.వెంకటపతి,టిడిపి మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు,మాజీ సర్పంచ్ మసాలా శ్రీను,మాజీ సర్పంచ్ బర్మా వీరేష్,ఈశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం రాంపల్లి కాశిరెడ్డి నాయన దేవస్థానం ఆవరణంలో మహానాడు వేడుకను పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ టీడీపీ నేతలు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది.అనంతరం స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ 'ఆత్మగౌరవాన్ని' పరిచయం చేసిన ధీరుడు ఎన్టీఆర్ అని,రాజకీయ రంగంలో ధృవతారగా వెలిగారన్నారు.పార్టీ కష్టకాలంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పార్టీని కాపాడి 44 ఏళ్లుగా బలోపేతంగా ముందుకు తీసుకెళ్తున్నారు అని వారు పేర్కొన్నారు.చంద్రబాబు, లోకేష్ లు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు.కూటమి ప్రభుత్వం 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తోందని అన్నారు.యువగళం ద్వారా లోకేష్ మూడో తరం నాయకత్వాన్ని నిరూపించుకుని పార్టీని విజయపథంలో నడిపిస్తున్నారని టీడీపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొత్తూరు చక్రపాణి,శివరాముడు, కొమ్ము వెంకటేష్,ప్రతాప్ యాదవ్, రాంపల్లి శ్రీనివాసులు,బత్తిన దేవేంద్ర,రాజేంద్ర గౌడ్, కోటేష్ గౌడ్, అక్బర్ బాషా,మోహన్, సోమశేఖర్ గౌడ్,డాక్టర్ చంద్ర,చిన్న పెద్దయ్య,చిన్న బొజ్జన్న,ముక్కెళ్ళ బాలు,చంద్ర మోహన్,పగిడిరాయి రాము,నక్కల రమేష్, నారాయణ గౌడ్, డీలర్ రంగస్వామి,మొట్టి సంజ్జన్న, మట్టి గుండమయ్య,ఎల్లా గౌడ్,నాగరాజు,హేమాద్రి నాయుడు,నారాయణ, ప్రసాద్, హరి,కవేంద్ర,రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అరకులోయలో మహిళల భద్రత, గంజాయి నివారణపై అవగాహన ర్యాలీ




**అరకులోయ :** స్థానిక అరకు వ్యాలీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీస్ సిబ్బంది మరియు నేషనల్ క్యాడెట్ క్రాప్స్ (చీజజ)200 మంది బృందం సంయుక్తంగా కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సమాజంలో మహిళల భద్రత, గంజాయి రహిత సమాజ స్థాపన, మరియు రహదారి భద్రత (రోడ్ సేఫ్టీ) నియమాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ ర్యాలీ సాగింది. అరకు వ్యాలీ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ప్రదర్శన.. పట్టణ పురవీధుల గుండా సాగుతూ వైయస్సార్ నాలుగు రోడ్ల జంక్షన్ వరకు చేరుకుంది.?ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులు మహిళల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గంజాయి వల్ల జరిగే నష్టాలు, వాహనదారులు పాటించాల్సిన రహదారి నిబంధనలపై ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ 200 మంది ప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి విద్యార్థినికి నవోదయలో సీటు..



**ఉలవపాడు మే 28 :** ఉలవపాడు శ్రీ సాయి హై స్కూల్ 9వ తరగతి విద్యార్థిని నల్లపరెడ్డి నేహా శ్రీ (కరేడు) కి మార్కాపురం జవహర్ నవోదయవిద్యాలయంలో ప్రవేశం పొందడం జరిగింది. సీటు సాధించిన నేహశ్రే ని పాఠశాల కరస్పాండెంట్ కేశవరపు వెంకట శేషమ్మ, ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించడం జరిగింది.


# తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్తలకు సత్కారం చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్



**పాతపట్నం. శ్రీకాకుళం జిల్లా మే 28 :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన సీనియర్ కార్యకర్తలను మహానాడు చివరి రోజున ఘనంగా సత్కరించారు పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా అహర్నిశలు శ్రమించిన కార్యకర్తల సేవలను గుర్తిస్తూ వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, పార్టీ అభివృద్ధిలో సీనియర్ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆశయాలు, చంద్రబాబు నాయుడు నాయకత్వం, నారా లోకేష్ యువశక్తితో పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు.సీనియర్ కార్యకర్తల అనుభవం యువతకు మార్గదర్శకమని, పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గౌరవం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. మహానాడు కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# తిరుపతి పార్లమెంట్ పరిధిలో ముగిసిన వర్చువల్ మహానాడు:ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న తుడా చైర్మన్ డా॥డాలర్స్ దివాకర్ రెడ్డి గారు




**తిరుపతి :** పార్లమెంట్ క్లస్టర్ 5 పరిధిలో గత రెండు రోజులుగా అత్యంత ఉత్సాహభరితంగా సాగిన 'వర్చువల్ మహానాడు' కార్యక్రమం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరైనారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ఆన్‌లైన్ వేదికగా జరిగిన ఈ రెండు రోజుల మహానాడులో క్లస్టర్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు,మరియు అభిమానులు పాల్గొన్నారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరిగాయి.చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై మహానాడులో విశేష హర్షం వ్యక్తమైంది.మహిళల రాజకీయ ప్రగతికి, వారి సాధికారతకు అండగా నిలుస్తూ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, అలాగే జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ గారికి ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని, చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అహర్నిశలు కృషి చేస్తామని ముక్తకంఠంతో ప్రతిజ్ఞ చేశారు.

# పిల్లల్లో పెరుగుతున్న ఏఎస్‌డీ సమస్య.. ముందుగానే గుర్తిస్తే మేలు..



ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో ఎక్కువగా గుర్తించబడుతున్న న్యూరో డెవలప్‌మెంటల్ సమస్యలలో ఒకటిగా మారుతోంది. సామాజిక పరస్పర చర్యలు, కమ్యూనికేషన్, ప్రవర్తనలో ప్రత్యేక లక్షణాలతో కనిపించే ఈ పరిస్థితి పిల్లల రోజువారీ జీవితంపై ప్రభావం చూపుతోంది. అయితే సరైన సమయంలో సరైన మద్దతు లభిస్తే ఆటిజం ఉన్న పిల్లలు కూడా ఆత్మవిశ్వాసంతో, భద్రతతో ఎదుగుతారని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చికిత్స మాత్రమే కాకుండా ఇంటి వాతావరణం కూడా కీలక పాత్ర పోషిస్తుందని సూచిస్తున్నారు. పిల్లలు కళ్లలోకి చూడకపోవడం, పేరు పిలిచినా స్పందించకపోవడం, మాట్లాడకపోవడం, చూపించి చెప్పే అలవాటు లేకపోవడం లేదా ముందుగా వచ్చిన కొన్ని నైపుణ్యాలు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. చిన్న వయస్సులోనే సమస్యను గుర్తించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని చెబుతున్నారు.ప్రారంభ దశలోనే మద్దతు అవసరం..ప్రారంభ దశలోనే మద్దతు అందించడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. జీవితంలోని తొలి సంవత్సరాల్లో సరైన సహాయం అందితే కమ్యూనికేషన్, ప్రవర్తన, స్వతంత్రంగా పనులు చేసుకునే సామర్థ్యంలో మెరుగుదల కనిపించే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు, తాతమ్మలు, సోదరులు పిల్లలకు మొదటి మద్దతుదారులుగా ఉండాలని సూచిస్తున్నారు. థెరపీ సెంటర్లలో మాత్రమే కాదు, ఇంట్లో ప్రతిరోజూ జరిగే ఆటలు, సంభాషణలు, పరస్పర చర్యల ద్వారా కూడా ప్రారంభ సహాయం అందించవచ్చని చెబుతున్నారు. చిన్నారులను స్క్రీన్‌లకు ఎక్కువగా అలవాటు చేయకుండా ఉండటం కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రెండేళ్ల వయస్సు వచ్చే వరకు స్క్రీన్ టైమ్ ను పూర్తిగా నివారించడం మంచిదని చెబుతున్నారు. బదులుగా పిల్లలు కుటుంబ సభ్యులతో కలిసి ఆడే ఆటలు, పాల్గొనే కార్యకలాపాలను ప్రోత్సహించాలని సూచిస్తున్నారుమాట్లాడడంలో ఇబ్బంది పడితే..మాట్లాడడంలో ఇబ్బంది పడే పిల్లలకు పద్ధతులు ఎంతో ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. పిక్చర్ బోర్డులు, కమ్యూనికేషన్ పుస్తకాలు, టాబ్లెట్‌లలో ఉండే స్పీచ్ యాప్స్ ద్వారా పిల్లలు తమ అవసరాలు, భావాలను వ్యక్తపరచగలుగుతారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో మాట్లాడేటప్పుడు అదే గుర్తులను ఉపయోగించడం ద్వారా పిల్లలకు అర్థం కావడం సులభమవుతుంది. దీని వల్ల నిరాశ తగ్గి, కమ్యూనికేషన్ మెరుగుపడే అవకాశం ఉంటుంది. ప్రతి చిన్నారిలో ఉండే ప్రత్యేక ఆసక్తులను గుర్తించి వాటి ద్వారా నేర్పించడం కూడా మంచి ఫలితాలు ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు పిల్లలకు ట్రైన్లు ఇష్టమైతే వాటి ద్వారా లెక్కలు, కథలు, వర్గీకరణ వంటి కార్యకలాపాలు నేర్పించవచ్చు. రంగులు, బ్లాక్స్, మట్టి వంటి సృజనాత్మక వస్తువులు పిల్లలు భావాలను వ్యక్తపరచడంలో సహాయ పడతాయి. పిల్లల ఆసక్తుల ఆధారంగా నేర్పితే ఒత్తిడి తగ్గి, నేర్చుకోవడం ఆనందంగా మారుతుందని చెబుతున్నారు. క్రమబద్ధమైన దినచర్య ఉండాలి..పిల్లలకు క్రమబద్ధమైన దినచర్య ఉండటం కూడా చాలా అవసరం. నిద్రలేవడం, భోజనం, ఆటలు, చదువు, నిద్ర వంటి కార్యకలాపాలకు ఒక నిర్దిష్ట సమయ పట్టిక ఉండేలా చూడాలి. చిత్రాలతో కూడిన విజువల్ టైమ్‌టేబుల్స్ ఉపయోగిస్తే పిల్లలకు అర్థం అవడం సులభమవుతుంది. రోజూ ఒకే విధమైన క్రమం పాటించడం వల్ల పిల్లల్లో ఆందోళన తగ్గి భద్రత భావన పెరుగుతుంది. ఆటిజం ఉన్న పిల్లలను చూసుకోవడం తల్లిదండ్రులకు భావోద్వేగపరంగా కష్టంగా మారే అవకాశమూ ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు కూడా తమ ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను పట్టించుకోవాలి. అవసరమైతే కౌన్సెలింగ్ తీసుకోవడం, ఇతర తల్లిదండ్రులతో మాట్లాడడం, సపోర్ట్ గ్రూప్‌లలో చేరడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. ఆటిజం ఉన్న పిల్లలను మార్చాలని కాదు, వారిని అర్థం చేసుకుని వారికి అనుకూలమైన వాతావరణం కల్పించడమే అసలు లక్ష్యం. కుటుంబం నుంచి వచ్చే ప్రేమ, సహనం, ప్రోత్సాహం పిల్లల ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు.

# యువతలోనూ అధికమవుతున్న పెద్ద పేగు క్యాన్సర్.. అప్రమత్తంగా ఉండకపోతే ముప్పేనని వైద్యుల హెచ్చరిక..



ప్రస్తుతం పెద్దలలో మాత్రమే కాదు, యువతలో కూడా పెద్దపేగు క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి చాలా కాలం పాటు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండా నెమ్మదిగా అభివృద్ధి చెందడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. చాలా సందర్భాల్లో దాదాపు పదేళ్ల వరకు కూడా ఎలాంటి హెచ్చరికలు కనిపించడం లేదు. మల విసర్జనలో మార్పులు, రక్తస్రావం, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపించే సమయానికి వ్యాధి ముదిరిపోయి ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే రోజువారీ జీవితంలో కొన్ని సులభమైన అలవాట్లు పాటించడం ద్వారా పెద్దపేగు క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా సమయానికి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం, ఆహారపు అలవాట్లలో మార్పులు తీసుకురావడం, శారీరక చురుకుదనం పెంచుకోవడం ఎంతో ముఖ్యమని చెబుతున్నారు.తరచూ పరీక్షలు అవసరం..45 ఏళ్ల వయస్సు వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా కొలొనోస్కోపీ పరీక్ష చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే పెద్దప్రేగు క్యాన్సర్ నిశ్శబ్దంగా అభివృద్ధి చెందుతుంది. లక్షణాలు బయటపడే సమయానికి అది ముందడుగు దశకు చేరి ఉండే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ముందుగానే స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం ఉంటుంది. ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకోవడం కూడా చాలా అవసరం. రోజుకు కనీసం 30 గ్రాముల ఫైబర్ తీసుకుంటే పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రోజువారీ ఫైబర్ వినియోగాన్ని కేవలం 10 గ్రాములు పెంచినా క్యాన్సర్ ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తు న్నాయి. కూరగాయలు, పండ్లు, గింజలు, సంపూర్ణ ధాన్యాలు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు.మాంసాహారాన్నితగ్గించాలి..ప్రాసెస్డ్ మాంసాహారం, రెడ్ మీట్ వినియోగాన్ని తగ్గించడం కూడా ముఖ్యమని చెబుతున్నారు. ప్రాసెస్డ్ మాంసాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ క్యాన్సర్‌కు కారణమయ్యే పదార్థంగా గుర్తించగా, రెడ్ మీట్‌ను కూడా ప్రమాదకరంగా పరిగణిస్తోంది. అందువల్ల వీటి వినియోగాన్ని తగ్గించడం ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు శారీరక వ్యాయామం లేదా నడక చేయడం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వ్యాయామం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, వ్యర్థాలు పెద్దప్రేగులో ఎక్కువసేపు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లిపోతాయి. దీని వల్ల హానికర పదార్థాలు పెద్దప్రేగు గోడలతో ఎక్కువసేపు సంబంధం కలిగి ఉండే ప్రమాదం తగ్గుతుంది. అలాగే మద్యం వినియోగాన్ని పూర్తిగా మానేయడం లేదా గణనీయంగా తగ్గించడం అవసరం. మద్యం పెద్దప్రేగు క్యాన్సర్‌కు నేరుగా ప్రమాద కారకంగా పనిచేస్తుంది. క్యాన్సర్ ప్రమాదం విషయంలో మద్యం సేవనానికి సురక్షితమైన పరిమితి అంటూ ఏదీ లేదు. పెద్దప్రేగు క్యాన్సర్‌ను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# అధిక బరువును త్వరగా తగ్గించుకోవాలని చూస్తున్నారా.. అయితే అలా చేయడం ప్రమాదకరం..



అధిక బరువు కారణంగా తలెత్తే అనారోగ్య సమస్యలపై అవగాహన రావడంతో చాలా మంది బరువు తగ్గే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం బరువు తగ్గడం చాలా మందికి ప్రధాన ఫిట్‌నెస్ లక్ష్యంగా మారింది. అయితే త్వరగా బరువు తగ్గడం ఆరోగ్యానికి మంచిదే అనుకోవడం తప్పని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వేగంగా బరువు తగ్గే ప్రయత్నాలు శరీరానికి అనేక రకాల నష్టాలను కలిగించే అవకాశం ఉందని అంటున్నారు. బరువు తగ్గడం విజయంగా కనిపించినా, లోపల శరీరం బలహీనపడే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు. వేగంగా బరువు తగ్గితే కేవలం కొవ్వు మాత్రమే కాదు, కండరాలు, ఎముకల దృఢత్వం, శరీర బలం కూడా తగ్గిపోతాయి. బయటకు శరీరం సన్నగా కనిపించినా, లోపల శక్తి తగ్గిపోవడం ప్రారంభమవుతుంది. దీనివల్ల భవిష్యత్తులో అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం పెరుగుతుంది.

కండరాలకు నష్టం..త్వరగా బరువు తగ్గడం వల్ల ప్రధానంగా కండరాల నష్టం ఎక్కువగా జరుగుతుంది. ముఖ్యంగా సరిపడా ప్రోటీన్ తీసుకోకపోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల శరీరంలోని లీన్ మజిల్ మాస్ వేగంగా తగ్గిపోతుంది. దీనిని సార్కోపీనియా అని పిలుస్తారు. ఇది శరీర బలాన్ని దెబ్బతీస్తుంది. అలాగే ఎముకలపై పడే ఒత్తిడి తగ్గిపోవడం, పోషకాహార లోపాలు కలగడం వల్ల ఎముకల దృఢత్వం కూడా తగ్గుతుంది. దీని కారణంగా ఫ్రాక్చర్ ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధుల్లో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కండరాలు శరీర మెటబాలిజంలో కీలక పాత్ర పోషిస్తాయి. అవి తగ్గిపోతే మెటబాలిజం మందగిస్తుంది. దీంతో భవిష్యత్తులో బరువు తగ్గడం కష్టమవుతుంది. మరోవైపు తిరిగి బరువు పెరగడం మాత్రం చాలా సులభమవుతుంది. ఇది ఆరోగ్యానికి మరింత ప్రమాదకరంగా మారుతుంది.పోషకాహార లోపం వచ్చే చాన్స్..ఆహారం తగ్గించడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు కూడా తక్కువగా అందుతాయి. ఐరన్, విటమిన్ బి12, విటమిన్ డి, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాల లోపం వల్ల అలసట, బలహీనత, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. వేగంగా బరువు తగ్గిన వారిలో సాధారణంగా బలహీనత, అలసట, రోజువారీ పనులు చేయడంలో ఇబ్బంది, త్వరగా గాయాలు కావడం వంటి సమస్యలు కనిపిస్తాయి. కండరాల బలం తగ్గిపోవడం వల్ల పడిపోవడం, గాయపడే ప్రమాదం కూడా పెరుగుతుంది. అదేవిధంగా శరీరంలో ఇన్సులిన్ స్పందన తగ్గి, భవిష్యత్తులో జీవక్రియ సంబంధిత వ్యాధుల ప్రమాదం కూడా పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు .ప్రోటీన్లు ముఖ్యం..ఆరోగ్యంగా బరువు తగ్గాలంటే సరైన విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. శరీర బరువు ప్రతి కిలోకు 1.2 నుంచి 1.6 గ్రాముల మంచిదని సూచిస్తున్నారు.

# జైస్వాల్ వెంటనే రాజస్థాన్‌ను వీడాలి

**● మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కీలక వ్యాఖ్యలు**



రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్‌లో క్వాలిఫయర్ 2 దాకా వెళ్లడంలో యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ కీలక పాత్ర పోషించాడనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే తనతోపాటు ఓపెనింగ్ చేస్తున్న యశస్వీ జైస్వాల్ కూడా ప్రస్తుత సీజన్‌లో మంచి ఇన్నింగ్స్‌లే ఆడాడు. 15 మ్యాచ్‌ల్లో 426 పరుగులు చేశాడు. స్ట్రైక్ రేట్ 150o ఉంది. ఈ గణాంకాలు చూస్తే ఒక ప్లేయర్‌కు ఇది బెటర్ సీజనే అని చెప్పవచ్చు. కానీ వైభవ్ తుఫాన్ ఇన్నింగ్స్‌లు, రికార్డుల మధ్య జైస్వాల్ ఆటకు దక్కాల్సిన ప్రాధాన్యం దక్కడంలేదు. దీనిపై మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కీలక వ్యాఖ్యలు చేశాడు. జైస్వాల్‌కు క్రెడిట్ దక్కాలంటే అతడు రాజస్థాన్ జట్టును వీడాలని అభిప్రాయపడ్డాడు. 2020 నుంచి జైస్వాల్ ఐపీఎల్‌లో రాజస్థాన్ జట్టుకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇప్పటివరకు 82 మ్యాచ్‌లు ఆడి 2592 పరుగులు సాధించాడు. ఈ సీజన్‌లో 426 పరుగులు చేయడమే కాకుండా రెండు మ్యాచ్‌ల్లో జట్టుకు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. అయితే జైస్వాల్ తన సొంత మార్క్ చూపించుకోవాలంటే రాజస్థాన్ నుంచి బయటకు రావాలని రాయుడు అన్నారు. వైభవ్ రాణించడంతో జైస్వాల్‌కు తగిన గుర్తింపు దక్కడం లేదని అభిప్రాయపడ్డాడు. అతడు ఏ జట్టులోనైనా మ్యాచ్ విన్నర్‌గా రాణించగడలని పేర్కొన్నాడు. అందుకే వైభవ్ షాడో (నీడ)లో జైస్వాల్ ఉండకూడదని అన్నాడు. ఈ మేరకు ప్రముఖ స్పోర్ట్స్ వెబ్‌సైట్ ఈఎస్‌పీఎన్ తో వ్యాఖ్యానించాడు. 'ఎప్పుడు కూడా వైభవ్ నీడలో జైస్వాల్ ఉండకూడదు. జైస్వాల్ ఏ జట్టులో ఉన్నా మ్యాచ్ విన్నర్‌గా రాణించగలడు. రానున్న రోజుల్లో వైభవ్ ఇతర ఆటగాళ్లను ఓవర్ షాడో చేస్తూనే ఉంటాడు. అందుకే తనతో పోటీ లేని ఇంకో ఆటగాడితో జైస్వాల్ ఓపెనింగ్ చేస్తే బాగుంటుంది. అలా జరగాలంటే అతడు రాజస్థాన్‌లోంచి బయటకు వచ్చి వేరే జట్టులో చేరాలి. ఎందుకంటే వైభవ్‌తో కలిసి బ్యాటింగ్ చేస్తూ ప్రతీసారి అతడి నీడలోనే ఉండిపోవాలంటే ఎవరికైనా కష్టమే. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న స్టార్ క్రికెటర్ జైస్వాల్. అతను వేరే జట్టుకు వెళితే, తనంతట తానుగా మ్యాచ్‌లు గెలిపిస్తాడు. అతనికి ఆ స్వేచ్ఛ, ఆ ప్లాట్‌ఫామ్ అవసరం. ఎందుకంటే వైభవ్ ఇతర ప్లేయర్లను కూడా డామినేట్ చేస్తూనే ఉంటాడు. కాబట్టి అతడితో ఓ సీనియర్ బ్యాటర్ ఓపెనింగ్‌కు రావాలి. అతడు వైభవ్ నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకొని, అతని విజయం పట్ల సంతోషించాలి. అంతేకానీ నాన్ స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న బ్యాటర్‌తో పోటీ పడకూడదు' అని రాయుడు అన్నాడు. ఒకవేళ జైస్వాల్ వేలంలోకి వస్తే అనేక ఫ్రాంచైజీలు అతడి కోసం పోటీ పడే అవకాశం ఉంటుంది. కానీ అతడికి మాత్రం ముంబయి ఇండియన్స్ జట్టు సూట్ అవుతుందని రాయుడు అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం జట్టులో స్టార్ ప్లేయర్ ఓపెనర్ రోహిత్ శర్మ కెరీర్ చివరి దశకు చేరుకుంటున్నందున, ముంబయికి జైస్వాల్ మంచి ఓపెనర్‌గా సెట్ అయ్యే ఛాన్స్ ఉంటుందని అన్నాడు.

# హార్దిక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ డిలీట్



సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. బుధవారం సాయంత్రం ఆయన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ అకస్మాత్తుగా కనిపించకుండా పోయింది. హార్దిక్ పేజీని ఓపెన్ చేస్తే "సారీ, ఈ పేజీ అందుబాటులో లేదు" అనే మెసేజ్ వస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 40 మిలియన్లకు పైగా ఫాలోవర్లను కలిగిన ఆయన అకౌంట్ డిలీట్ కావడం వెనుక ఐపీఎల్ 2026 వైఫల్యాలే కారణమని తెలుస్తోంది. ఈ సీజన్ లో ఐదుసార్లు ఛాంపియన్స్ అయిన ముంబై టీమ్ దారుణంగా విఫలమైంది. లీగ్ స్టేజ్ లో ఆడిన 14 మ్యాచ్‌ల్లో కేవలం 4 విజయాలు మాత్రమే సాధించి పాయింట్ల పట్టికలో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సీజన్ ముంబై ఇండియన్స్ జట్టుకే కాకుండా హార్దిక్ పాండ్యాకు వ్యక్తిగతంగా కూడా చాలా నిరాశాజనకంగా సాగింది. గాయాలు, ఫామ్ లేమితో ఇబ్బంది పడిన ఆయన ఆడిన 8 ఇన్నింగ్స్‌లలో కేవలం 146 పరుగులు మాత్రమే చేయగలిగాడు. బౌలింగ్‌లోనూ పెద్దగా ఇంపాక్ట్ చూపించలేక కేవలం 3 వికెట్లు మాత్రమే పడగొట్టారు. కెప్టెన్ గా, ప్లేయర్ గా ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఆయనపై విపరీతమైన ట్రోలింగ్ జరిగింది. ఈ మానసిక ఒత్తిడిని తట్టుకోలేకనే ఆయన ఇన్‌స్టాగ్రామ్ నుండి తప్పుకుని ఉంటారని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. టీమిండియా మాజీ బ్యాటర్ వసీం జాఫర్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ముంబై ఇండియన్స్ ఫ్యూచర్ ప్లాన్స్ పై స్పందించాడు.

# సత్తా చాటిన భారత అథ్లెట్లు!



రత మహిళా షూటర్ ఈషా సింగ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. జర్మనీ వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ వరల్డ్‌కప్ మ్యూనిచ్‌లో ఈషా కొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేసింది. 25 మీటర్ల మహిళల పిస్టల్ ఈవెంట్‌లో ఈషా 50కిగానూ 43 స్కోర్ చేసింది. ఈ ఈవెంట్‌లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. దీంతో సరికొత్త రికార్డుతోపాటు ఈషా స్వర్ణ పతకం గెలుచుకుంది. రెండో రోజు జరిగిన పోటీలో 21ఏళ్ల ఈషా, జర్మనీకి చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ డోరీన్ వానెకాంప్‌తో పోటీ పడింది. 5 పాయింట్ల తేడాతో ప్రత్యర్థిని ఓడించిన ఈషా గోల్డ్ పట్టేసింది. ఒలింపిక్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఈషా ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించింది. తొలి మూడు సిరీస్‌లలోనూ పర్ఫెక్ట్ స్కోర్లు సాధించి, ప్రత్యర్థులపై భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. ఈ క్రమంలోనే కిమ్ యే-జి (కొరియా) నెలకొల్పిన 42 పాయింట్ల ప్రపంచ రికార్డును ఈషా బద్దలు కొట్టింది. ఇక ఈ పోటీలో మూడో స్థానంలో నిలిచిన మిరోస్లావా (బల్గేరియా) మిన్‌చెవా కాంస్య పతకాన్ని గెలుచుకుంది. స్వర్ణ పతకం గెలిచిన తర్వాత ఇషా సింగ్ మాట్లాడుతూ, "నాకు మ్యూనిచ్ చాలా ముఖ్యమైనది. ఇక్కడ షూటింగ్ పోటీలలో పోటీ చాలా కఠినంగా ఉంటుంది. టాప్-8 లోకి రావడం అంత సులభం కాదు. నేను ఇక్కడికి రావడం ఇది మూడోసారి. అందుకే ఈసారి ఎలాగైనా గెలవాలని కోరుకున్నాను" అని తెలిపింది. అలాగే ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఒత్తిడి గురించి మాట్లాడుతూ, "నేను అస్సలు ప్రశాంతంగా లేను. ఒకానొక సమయంలో నా ఎడమ చేయి వణికింది. చాలా భయం వేసింది. కానీ మన క్రీడలో ఆ ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. అనుభవం అంటే అదే" అని ఈషా పేర్కొంది. మరోవైపు భారత పారాఅథ్లెట్ సుమిత్ అంటిల్ కూడా రికార్డు సృష్టించాడు. బెంగళూరు వేదికగా జరుగుతున్న 8వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో, సుమిత్ క్రీడా ప్రపంచాన్ని నివ్వెరపరిచే అద్భుత ఘనతను అందుకున్నాడు. భారత ఈ స్టార్ జావెలిన్ త్రోయర్ తన కెరీర్‌లో ఏడోసారి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి, చరిత్ర పుటల్లో మరో సువర్ణ అధ్యాయాన్ని లిఖించాడు. బుధవారం శ్రీ కంఠీరవ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఖీ64 విభాగం పోటీలో 27ఏళ్ల సుమిత్ 74.82 మీటర్ల భారీ త్రో విసిరి వరల్డ్ రికార్డ్ నెలకొల్పాడు. పారా అథ్లెట్లలో ఇదే లాంగెస్ట్ త్రో. ఇదివరకు కూడా ఈ విభాగంలో అత్యధిక దూరం బల్లెం విసిరిన రికార్డు కూడా సుమిత్‌పైనే ఉంది. 2023 ఆసియా పారా గేమ్స్‌లో అతడు 73.29 మీటర్ల దూరం విసిరి అప్పుడు రికార్డు కొట్టాడు. దీన్ని తాజాగా బ్రేక్ చేశాడు. అయితే 2019 నుంచి అతడు ఈ విభాగంలో వరుసగా ప్రపంచ రికార్డులను నెలకొల్పుతూనే ఉన్నాడు. 2019లో ఇటలీలో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌తో సుమిత్ ప్రస్థానం ప్రారంభమైంది. అక్కడ అతను 61.32 మీటర్ల త్రో తో తొలిసారి ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఆ తర్వాత 2021లో జరిగిన టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకాన్ని గెలుచుకునే క్రమంలో మూడుసార్లు ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఆ పోటీలో సుమిత్ వరుసగా 66.95 మీటర్లు, 68.08 మీటర్లు, 68.55 మీటర్ల త్రోలు విసిరి చరిత్ర సృష్టించాడు. అదే సంవత్సరం ఆఖర్లో ఇండియన్ ఓపెన్‌లో 68.62 మీటర్ల త్రో తో మరో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఆపై 2023 హాంగ్‌జౌ ఆసియా పారా గేమ్స్‌లో 73.29 మీటర్ల త్రో తో సుమిత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. తాజాగా బెంగళూరులో 74.82 మీటర్ల దూరం విసిరి మళ్లీ తన రికార్డును తానే బద్దలు కొట్టాడు.

# క్రిస్ గేల్ వరల్డ్ రికార్డు బద్దలు కొట్టిన వైభవ్



ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పై రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత బ్యాటింగ్ తో హిస్టరీ క్రియేట్ చేశారు. ఈ మ్యాచ్ లో కేవలం 29 బంతుల్లోనే 12 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. ఈ ఇన్నింగ్స్ తో ఒకే ఐపీఎల్ సీజన్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్లేయర్‌గా వెస్టిండీస్ లెజెండ్ క్రిస్ గేల్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. గేల్ 2012 సీజన్ లో 59 సిక్సర్లు కొట్టగా, సూర్యవంశీ ఆ మార్కును ఈజీగా దాటేశాడు. స్టేడియం స్క్రీన్ పై ఆయనను "యూనివర్స్ బేబీ బాస్" అని సంబోధించడం విశేషం. ఈ మ్యాచ్ లో సూర్యవంశీ కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఐపీఎల్ నాకౌట్ లేదా ప్లేఆఫ్స్ హిస్టరీలో సురేష్ రైనా పేరిట ఉన్న ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును ఆయన సమం చేశాడు. కేవలం ఒకే ఒక్క బంతి తేడాతో క్రిస్ గేల్ పేరిట ఉన్న ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీ (30 బంతుల్లో) రికార్డును మిస్ చేసుకున్నాడు. 20 లోపు బంతుల్లో అత్యధిక సార్లు యాభై పరుగులు చేసిన జాబితాలో 5 సార్లతో నికోలస్ పూరన్ సరసన నిలిచాడు. అలాగే పవర్‌ప్లే లోనే అత్యధిక సిక్సర్లు (8 సిక్సర్లు) బాదిన సరికొత్త రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ 15 ఏళ్ల వండర్ కిడ్ అసాధారణ పర్ఫార్మెన్స్ చూసి ఆయనను సీనియర్ ఇండియన్ మెన్స్ టీమ్‌లోకి సెలెక్ట్ చేయాలనే డిమాండ్ క్రికెట్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఐపీఎల్ డెబ్యూ చేసిన ఏడాది లోపే ఈ రేంజ్ లో ఆడటంతో ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. వచ్చే నెలలోనే తిలక్ వర్మ కెప్టెన్సీలోని ఇండియా-ఎ టీమ్ తరపున శ్రీలంకలో జరిగే ట్రై-సిరీస్ లో సూర్యవంశీ బరిలోకి దిగనున్నాడు. సూర్యవంశీ ఫ్యూచర్ పై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పందిస్తూ ఆయనను ఒక 'స్పెషల్ టాలెంట్' గా అభివర్ణించారు. భవిష్యత్తులో సూర్యవంశీ లాంటి ప్లేయర్లను బీసీసీఐ, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు సరైన దారిలో గైడ్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేవలం ఫిజికల్ స్కిల్స్ మాత్రమే కాకుండా మెంటల్ టఫ్నెస్ కూడా స్పోర్ట్స్ లో చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ అద్భుతమైన టాలెంట్ రాబోయే రోజుల్లో టీమిండియా తరపున ఎన్నో ఏళ్ల పాటు సేవలు అందించేలా తాము పూర్తి సపోర్ట్ అందిస్తామని ధుమాల్ కన్ఫర్మ్ చేశారు.



# ఐపీఎల్‌లో హనీ ట్రాప్ కలకలం..

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ.. తెరవెనుక వివాదాలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో ఉపయోగించిన హనీ-ట్రాప్ అనే పదం క్రికెట్ వర్గాల్లో పెద్ద దుమారానికి కారణమైంది. ఈ వ్యాఖ్యలు బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేశాయి. కొందరు ఆకతాయిలు ఏకంగా ఐపీఎల్ క్రికెటర్ల భార్యలు, పార్ట్‌నర్లను టార్గెట్ చేస్తూ ట్రోలింగ్, వేధింపులకు దిగడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ వివాదంపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా స్పందిస్తూ కీలక వివరణ ఇచ్చారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్లో ఎలాంటి హనీ-ట్రాపింగ్ ఉదంతాలు తమ దృష్టికి రాలేదని ఆయన స్పష్టం చేశారు. ఐపీఎల్ అనేది అత్యంత పారదర్శకంగా, స్వచ్ఛంగా సాగుతున్న టోర్నమెంట్ అని, ఇలాంటి లేనిపోని పుకార్లను నమ్మవద్దని ఆయన అభిమానులను కోరారు. అయితే ఈ సీజన్లో ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్, ఫ్రాంచైజీల మేనేజ్‌మెంట్ వైపు నుంచి కొన్ని క్రమశిక్షణా ఉల్లంఘనలు, ప్రోటోకాల్ వివాదాలు జరిగిన మాట నిజమేనని బీసీసీఐ అంగీకరించింది. ఇలాంటి సంఘటనలను ముందే అరికట్టకపోతే టోర్నమెంట్‌తో పాటు బోర్డు ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా 10 ఐపీఎల్ ఫ్రాంచైజీల సీఈఓలకు ఒక సుదీర్ఘమైన హెచ్చరిక లేఖ రాశారు.

# వైభవ్ సూర్యవంశీకి ముంబై ఇండియన్స్ బంపర్ ఆఫర్..

ఐపీఎల్ 2026 సీజన్లో తన బ్యాటింగ్‌తో రికార్డులన్నింటినీ బ్రేక్ చేస్తున్న 15 ఏళ్ల రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ పేరు ప్రస్తుతం దేశవ్యాప్తంగా మారుమోగిపోతోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లోనే 12 సిక్సర్లతో 97 పరుగులు బాది, ఒకే సీజన్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన క్రిస్ గేల్ రికార్డును బద్దలు కొట్టిన సంగతి తెలిసిందే. ఈ రేంజ్ పర్ఫార్మెన్స్ తర్వాత వైభవ్‌కు పాపులారిటీతో పాటు సోషల్ మీడియాలో కొన్ని రూమర్స్ కూడా అంతే వేగంగా చుట్టుముట్టేస్తున్నాయి. ప్రస్తుతం ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఒక షాకింగ్ వార్త తెగ హల్‌చల్ చేస్తోంది. ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ.. భవిష్యత్తు సీజన్లలో వైభవ్ సూర్యవంశీని తమ జట్టులోకి లాగేసుకోవడానికి ఒక భారీ ఆఫర్ ఇచ్చిందని ప్రచారం జరుగుతోంది. ముంబైలో వైభవ్‌కు ఏకంగా రూ.30 కోట్ల విలువైన లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను ముంబై ఇండియన్స్ యాజమాన్యం గిఫ్ట్‌గా ఆఫర్ చేసిందని, దీనిపై ఇరు పక్షాల మధ్య చర్చలు కూడా ముగిశాయని కొన్ని వీడియోలు, పోస్టులు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ క్లెయిమ్ వెనుక ఉన్న అసలు సత్యాన్ని పరిశీలిస్తే సోషల్ మీడియా మైండ్ గేమ్స్ ఎలా ఉంటాయో అర్థమవుతుంది. ఈ ఐపీఎల్ 2026 లో వైభవ్ సూర్యవంశీ ఆడిన ఆటతీరు మామూలుగా లేదు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఓపెనర్‌గా వస్తూ 240 కి పైగా స్ట్రైక్ రేట్‌తో బౌలర్లను చెడుగుడు ఆడుకుంటున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. హైదరాబాద్‌పై కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన ఈ చిన్నోడు.. ప్రస్తుతం టోర్నమెంట్‌లో అత్యధికంగా 680 పరుగులతో సగర్వంగా ఆరెంజ్ క్యాప్‌ను తన దగ్గరే ఉంచుకున్నాడు. ఇంత క్రేజ్ ఉంది కాబట్టే, ముంబై ఇండియన్స్ అతనికి రూ.30 కోట్ల ఫ్లాట్ ఆఫర్ చేసిందనే వార్తను అందరూ నిజమేనని నమ్మేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టమైంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ గానీ, లేదా స్వయంగా వైభవ్ సూర్యవంశీ గానీ ఇలాంటి ఆఫర్ గురించి ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం కూడా ఒక జట్టులో ఉన్న ప్లేయర్‌కు వేరే ఫ్రాంచైజీ ఇలాంటి రహస్య ఆఫర్లు ఇవ్వడానికి వీల్లేదు. ఐతే ఈ రూమర్ ఎలా పుట్టిందంటే.. ఇటీవల వైభవ్ ముంబై నగరంలో ఒక లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను సొంతంగా కొనుగోలు చేశాడు. దాని అసలు విలువ సుమారు రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఉంటుంది. ఈ ప్రాపర్టీ ఇన్వెస్ట్‌మెంట్‌ను కొందరు సోషల్ మీడియా ఆకతాయిలు ముంబై ఇండియన్స్ ఆఫర్‌గా మార్చేసి, రూ.3 కోట్లను కాస్తా రూ.30 కోట్లుగా పెంచి ఫేక్ ప్రచారం మొదలుపెట్టారు. లలిత్ మోదీ పేరుతో కూడా కొన్ని ఫేక్ పోస్టులు ఎక్స్‌లో దర్శనమిచ్చాయి. ప్రస్తుతానికైతే వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ జట్టులోనే అత్యంత కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. అతను జట్టును వీడి వెళ్లే ప్రసక్తే లేదు. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను మట్టికరిపించిన రాజస్థాన్ రాయల్స్.. మే 29న జరగబోయే అత్యంత కీలకమైన క్వాలిఫైయర్ 2 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే, డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తో ఫైనల్ ఫైట్‌కు రాజస్థాన్ అర్హత సాధిస్తుంది. వైభవ్ తన పూర్తి ఫోకస్‌ను ఈ మ్యాచ్‌పైనే పెట్టాడు.



# సందీప్ సినిమాల్లో హీరోయిన్లది

# భావోద్వేగ పాత్ర

## - స్పిరిట్‌లోనూ అదే కనిపిస్తుందనన్న దర్శకుడు హేమంత్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. అయితే తాజాగా ప్రముఖ దర్శకుడు హేమంత్ మధుకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో హీరోయిన్ పాత్రల గురించి మాట్లాడిన హేమంత్ మధుకర్.. ఆయన సినిమాల్లో కనిపించే రొమాంటిక్ సన్నివేశాలను చూసి హీరోయిన్లకు కేవలం గ్లామర్ పాత్రలే ఉంటాయని అనుకోవడం తప్పని అన్నారు. సందీప్ తన కథల్లో మహిళా పాత్రలను చాలా బలంగా, భావోద్వేగాలకు దగ్గరగా రాస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'అర్జున్ రెడ్డి'లో శాలినీ పాండే పోషించిన ప్రీతి పాత్రను, అలాగే 'యానిమల్'లో రష్మిక మందన్న చేసిన గీతాంజలి పాత్రను ఉదాహరణగా చెప్పారు. ఆ పాత్రలు కేవలం హీరోకు జోడీగా మాత్రమే కాకుండా కథలో కీలకమైన భావోద్వేగ బలాన్ని ఇచ్చాయని అన్నారు. త్రిప్తి దిమ్రి ఎంపికపై కూడా హేమంత్ స్పందించారు. నటీనటుల మధ్య పోలికలు పెట్టడం సరికాదని, ప్రతి పాత్రకు తగిన నటుడిని లేదా నటిని దర్శకుడు ఎంపిక చేస్తాడని చెప్పారు. 'స్పిరిట్'లోని పాత్రకు త్రిప్తి దిమ్రి పూర్తిగా సూట్ అవుతుందని భావించి సందీప్ ఆమెను ఎంపిక చేశారని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమాలో త్రిప్తి నటన ప్రేక్షకుల అంచనాలను మించేలా ఉంటుందని హేమంత్ మధుకర్ ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే 'యానిమల్' సినిమాతో త్రిప్తి దిమ్రికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు ప్రభాస్ సరసన 'స్పిరిట్'లో నటించడం ఆమె కెరీర్‌లో మరో కీలక మలుపుగా మారనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక 'స్పిరిట్' సినిమా విషయానికి వస్తే.. ఇది పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సందీప్ రెడ్డి వంగా స్టైల్‌లో యాక్షన్, ఎమోషన్, ఇంటెన్స్ డ్రామాతో ఈ సినిమా రూపొందనుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం.






# సింగిల్ మదర్‌గా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా...

## ● మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్

24 ఏళ్ల వయసులో పెద్ద కుమార్తె రెనీని దత్తత తీసుకున్నప్పుడు ఎదుర్కొన్న విమర్శలను, ఇబ్బందులను బాలీవుడ్ నటి, మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ తాజాగా గుర్తుచేసుకుంది. ఒక సింగిల్ మదర్‌గా తల్లి కావాలనే తన నిర్ణయం వల్ల కెరీర్ ముగిసిపోతుందని అందరూ భావించారని, చివరికి తన మేనేజర్ కూడా తనను వదిలేసి వెళ్లిపోయాడని ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సుస్మితా సేన్ మాట్లాడుతూ.. 'నేను రెనీని దత్తత తీసుకున్నప్పుడు నా మేనేజర్ నన్ను వదిలి పారిపోయాడు. 'నీకు కెరీర్ పట్ల సీరియస్ నెస్ లేదు.. 24 ఏళ్లకే తల్లి అయిన వ్యక్తికి నేను మేనేజర్‌గా ఉండలేను' అని చెప్పాడు. అంతేకాదు, ఇకపై నాకు హీరోయిన్‌గా అవకాశాలు రావని, కేవలం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానే మిగిలిపోతానని చాలామంది హెచ్చరించారు అని సుస్మితా చెప్పుకొచ్చింది. అయితే తనకు పరిశ్రమ నుంచి ఎలాంటి మద్దతు లభించనప్పటికీ, మాతృత్వమే తనను మరింత బలోపేతం చేసిందని సుస్మితా చెప్పారు. కూతురు వచ్చిన తర్వాతే నా కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ సినిమాలు ఇచ్చాను. రెనీని దత్తత తీసుకున్న తర్వాత 'ఆంఖే', 'మై హూ నా', 'మైనే ప్యార్ క్యూ కియా' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించాను. ఇటీవలి కాలంలో 'ఆర్య' వెబ్ సిరీస్, 'తాలి' బయోపిక్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా తన నటనతో అలరించాను అంటూ సుస్మితా చెప్పుకొచ్చింది. ఇక సుస్మితా సేన్ జీవితంలో మాతృత్వానికి ఎప్పుడూ మొదటి స్థానమే ఉంటుంది. 2010లో ఆమె 'అలీషా' అనే మరో అమ్మాయిని కూడా దత్తత తీసుకున్నారు. వీరిద్దరితో కలిసి తనదైన ఒక అందమైన ప్రపంచాన్ని నిర్మించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. సుస్మితా పెద్ద కుమార్తె రెనీ కూడా ప్రస్తుతం యాక్టింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. భయం లేకుండా, ఒదిగి ఉండటాన్ని తన తల్లి నుంచే నేర్చుకున్నానని రెనీ పలు సందర్భాల్లో చెప్పారు. 1994లో మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించిన సుస్మితా సేన్, ఆ తర్వాత తన వ్యక్తిగత నిర్ణయాలపై వచ్చిన విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా, అనుకున్నది సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన ధనుష్ కర




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన లేటెస్ట్ హీస్ట్ థ్రిల్లర్ మూవీ 'కర' తాజాగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలైనప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ పొందలేకపోయింది. మంచి అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. ఇప్పుడు ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్ స్ట్రీమింగ్ జరుపుకుంటుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. అలాగే ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో కూడా స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో ఈ సినిమాను వీక్షించే అవకాశం దక్కింది.'కర' సినిమాలో ధనుష్ తనదైన స్టైల్‌లో ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. హీస్ట్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో సస్పెన్స్, యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌ను మిళితం చేస్తూ దర్శకుడు విఘ్నేష్ రాజా కథను రూపొందించారు. అయితే కథనం నెమ్మదిగా సాగడం, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను పూర్తిగా ఎంగేజ్ చేయలేకపోవడం వంటి కారణాలతో థియేటర్లలో ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ చిత్రంలో 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటించింది. ధనుష్‌తో ఆమె కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ప్రముఖ నటులు సూరజ్ వెంజరామూడు, కేఎస్ రవికుమార్, జయరామ్ కీలక పాత్రల్లో కనిపించారు. వీరి నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. ముఖ్యంగా థ్రిల్లింగ్ సన్నివేశాల్లో ఆయన సంగీతం సినిమాకు మరింత ఉత్కంఠను తీసుకువచ్చింది.

# కరుప్పు..మొదటి హీరో విజయే



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాజకీయాల్లోకి వెళ్లేముందు ఆయన చివరి చిత్రంగా 'కరుప్పు' సినిమాను చేయాల్సిందని.. కానీ కొన్ని కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవడంతో, ఈ అవకాశం హీరో సూర్యను వరించిందని దర్శకుడు ఆర్జే బాలాజీ తెలిపాడు.విజయ్ రాజకీయాల్లోకి వచ్చే ముందు ఎలాంటి సినిమా చేయాలనే దానిపై తాము రెండు మూడు సార్లు సమావేశమై చర్చించామని బాలాజీ చెప్పారు. అయితే విజయ్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నా, ఆయన చెప్పిన కారణాలు సమంజసంగానే ఉన్నాయని, ఆయన నిర్ణయాన్ని తాను గౌరవించానని తెలిపారు. అంతేకాదు, కథా చర్చల సమయంలో విజయ్ అడిగిన సరైన ప్రశ్నలే స్క్రిప్ట్‌ను మరింత మెరుగు పరచడానికి సహాయపడ్డాయని, అందుకే సినిమా ప్రారంభ క్రెడిట్స్‌లో విజయ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపానని బాలాజీ పేర్కొన్నారు. ఆ తర్వాత నిర్మాతల కోరిక మేరకు ఈ కథను సూర్యకు వినిపించగా, ఆయనకు బాగా నచ్చి కొన్ని మార్పులు సూచించారు. అలా సూర్య హీరోగా 'కరుప్పు' సినిమా పట్టాలెక్కింది.

# ట్రాఫిక్‌లో కారు వదిలేసి పరుగెత్తిన సుమ....



తెలుగు టెలివిజన్ ప్రపంచంలో యాంకర్ సుమ కనకాల పేరు ఒక బ్రాండ్‌గా మారిపోయింది. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న సుమ.. గత 20 ఏళ్లుగా యాంకరింగ్ రంగంలో అగ్రస్థానంలో దూసుకుపోతున్నారు. 50 ఏళ్లు దాటినా అదే ఎనర్జీ, అదే టైమింగ్, అదే ఉత్సాహంతో ప్రేక్షకులను అలరిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. మలయాళ కుటుంబానికి చెందిన సుమ.. తెలుగును అనర్గళంగా మాట్లాడగలగడం ఆమెకు ఉన్న పెద్ద ప్లస్ పాయింట్. అంతేకాదు తెలుగు సహా ఐదు భాషలను సులభంగా మాట్లాడగల సామర్థ్యం ఆమెకు ఉంది. ముఖ్యంగా ఆమె మాట తీరు, స్పష్టమైన ఉచ్చారణ, టైమింగ్‌తో చెప్పే కామెడీ, ఎనర్జిటిక్ ప్రెజెంటేషన్ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంటాయి.టాలీవుడ్‌లో ఎలాంటి పెద్ద ఈవెంట్ జరిగినా అక్కడ సుమ ఉండాల్సిందే అన్నంతగా ఆమె క్రేజ్ సంపాదించుకుంది. స్టార్ హీరోల ప్రీ రిలీజ్ ఈవెంట్లు, ఆడియో ఫంక్షన్లు, ట్రైలర్ లాంచ్‌లు, అవార్డు వేడుకలు.. ఇలా ఏ కార్యక్రమమైనా సుమ తనదైన శైలిలో విజయవంతంగా నిర్వహిస్తుంటారు. ఎన్నేళ్లు గడిచినా ఆమె యాంకరింగ్‌లో అదే ఫ్రెష్‌నెస్ కనిపించడం విశేషం.సుమ సక్సెస్ వెనుక ఆమె డెడికేషన్, టైమ్ సెన్స్ ప్రధాన కారణాలని ఇండస్ట్రీ వర్గాలు చెబుతుంటాయి. చిన్న ఈవెంట్ అయినా, పెద్ద కార్యక్రమమైనా సమయానికి హాజరు కావడం ఆమె అలవాటు. ఎన్ని అవాంతరాలు వచ్చినా ప్రొఫెషనలిజాన్ని మాత్రం ఎప్పుడూ మిస్ కాకుండా చూసుకుంటారు.

# చిన్న నిర్మాతలను పట్టించుకోవడం లేదు

## ● నిర్మాత ధీరజ్ మొగిలినేని ఆసక్తికర వ్యాఖ్యలు

టాలీవుడ్‌లో ఇటీవల నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య కొనసాగుతున్న 'పర్సంటేజ్ విధానం' వివాదం పెద్ద చర్చగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు స్టార్ నిర్మాతలు కలిసి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాజమండ్రిలో కలవడం ఇండస్ట్రీలో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ భేటీపై ఇప్పుడు నిర్మాత ధీరజ్ మొగిలినేని ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్, సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నాగవంశీ, ఫైన్ స్క్రీన్స్ సాహు గారపాటి, వృద్ధి సినిమాస్ వెంకట్ సతీశ్ కిలారు, ఎస్‌ఎల్వీ సినిమాస్ చెరుకూరి సుధాకర్ తదితర ప్రముఖ నిర్మాతలు పవన్ కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, ముఖ్యంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో 'పర్సంటేజ్ విధానం' అంశంపై చర్చించినట్లు సమాచారం.అయితే ఈ భేటీలో చిన్న, మీడియం రేంజ్ నిర్మాతలకు ప్రాతినిధ్యం లభించలేదని నిర్మాత ధీరజ్ మొగిలినేని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిగిన 'సమ్మర్ హాలిడేస్' సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమంలో



ఆయన ఈ విషయంపై స్పందించారు.'మాకు కూడా చాలా సమస్యలు ఉన్నాయి. రూ.100 కోట్లకు పైగా బడ్జెట్‌తో సినిమాలు తీసే పెద్ద నిర్మాతల సమస్యలు వేరు. చిన్న, మీడియం రేంజ్ సినిమాలు నిర్మించే నిర్మాతల సమస్యలు మరోలా ఉంటాయి. పవన్ కళ్యాణ్ గారిని కలిసేందుకు వెళ్లినప్పుడు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మమ్మల్ని ఎవర్నీ పిలవలేదు. కేవలం వాళ్లే వెళ్లారు' అంటూ ధీరజ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన అభిప్రాయాన్ని వివరించేందుకు ఆయన ఆసక్తికర ఉదాహరణ కూడా చెప్పారు. 'జూబ్లీహిల్స్‌లో 1000 గజాల ప్లాట్‌లో రూ.10 కోట్లతో ఇల్లు కట్టుకునేవారి సమస్యలు ఒకలా ఉంటాయి. మణికొండలో 250 గజాల ప్లాట్‌లో ఇల్లు కట్టుకునేవాడి సమస్యలు మరోలా ఉంటాయి. ఇద్దరూ ఇళ్లే కడుతున్నారు కానీ పరిస్థితులు, అవసరాలు వేరు. అలానే పెద్ద సినిమాలు తీసేవారి సమస్యలు వేరు.. చిన్న నిర్మాతల సమస్యలు వేరు' అని వ్యాఖ్యానించారు. ఇక ప్రస్తుతం జరుగుతున్న పర్సంటేజ్ వివాదంలో చిన్న నిర్మాతల ఇబ్బందులను ఎవరూ సరిగా అర్థం చేసుకోవడం లేదని ధీరజ్ అన్నారు. త్వరలోనే చిన్న, మీడియం రేంజ్ నిర్మాతలంతా కలిసి పవన్ కళ్యాణ్‌ను కలిసి తమ సమస్యలను వివరించనున్నట్లు తెలిపారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com